ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

బుధవారం, 3 జనవరి 2024

2 రోజులు.. రూ.10 కోట్ల మద్యం

- నూతన సంవత్సర వేడుకల్లో భారీగా పెరిగిన అమ్మకాలు



నెల్లూరు (క్రైం), జనవరి 2 : నూతన సంవత్సర వేడుకల్లో మందుబాబుల నుంచి రూ.కోట్ల మద్యం తాగించాలని ప్రభుత్వం ముందుగా వేసిన ప్లాన్ బాగా సక్సెస్ అయినట్లు కనిపిస్తోంది. డిసెంబరు 31, జనవరి 1వ తేదీలు అంటే రెండే రెండు రోజుల్లో రూ.10.71 కోట్ల మద్యాన్ని ఉఫ్ అనిపించారు. విక్రయాలు పెంపే లక్ష్యంగా ఆ రెండు రోజుల్లో అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం షాపులకు, 1 గంట వరకు బార్లకు సమయ వేళలు పెంచారు. సహజంగా జిల్లాలో ఒక్క రోజుకు రూ.3 కోట్ల మద్యం సేల్స్ ఉంటాయి. అయితే డిసెంబరు 31న రూ.6.34 కోట్లు, జనవరి 1వ తేదీన రూ.4.37 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. మద్యపాన నిషేధం చేసి ఎన్నికల్లో ఓట్లు అడుగుతామన్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మద్యం దుకాణాల వేళలు పెంచి మందు బాబులను తాగండి.. ఊగండి అంటూ దోచుకుంటున్నారని ప్రజలు పేర్కొంటున్నారు.



పోలీసుల పరుగుల వేట!

- అట్టహాసంగా పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

నెల్లూరు (క్రైం), జనవరి 2 : లాఠీలు పట్టుకుని నేరస్థుల వెనుకబడే పోలీసులు బాల్ చేత పట్టుకొని వికెట్లు తీసేందుకు పరుగులు తీశారు. ఖాకీ డ్రస్ వేసుకొని పని ఒత్తిడిలో ఉండే పోలీసులు క్రీడా దుస్తులు ధరించి గెలుపు కోసం శ్రమించారు. నెల్లూరులోని పోలీస్ పరేడ్ మైదానంలో నువ్వా.. నేనా!? అన్నట్టు ఆహ్లాదకర వాతావరణంలో క్రీడలు ఆడుతూ ఉత్సాహంగా గడిపారు. జిల్లా వార్షిక స్పోర్ట్స్ మీట్-2023 అట్టహాసంగా మంగళవారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఈ స్పోర్ట్స్ మీట్‌ను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పావురాలను, బెలూన్‌లను గాలిలోకి వదిలి ప్రారంభించారు. ఐదు సబ్ డివిజన్లు, ఏఆర్, హోమ్‌గార్డ్స్, డీపీవో అధికారులు, సిబ్బంది ఈ క్రీడల్లో పాల్గొంటున్నారు.



బ్యాటింగ్ చేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వర రెడ్డి

ఎస్పీ ఆల్‌రౌండ్ షో

స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన ఎస్పీ తోటి అధికారులు, సిబ్బందితో కలిసి క్రికెట్ ఆడారు. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో ఎస్పీ ఆల్‌రౌండ్ షో ప్రదర్శించి అందరినీ ఆశ్చర్యపరిచారు. తొలిరోజు అథ్లెటిక్స్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్, క్యారమ్స్, క్రికెట్ తదితర పోటీల్లో పోలీసు అధికారులు, సిబ్బంది హోరాహోరీగా తలబడ్డారు.



నెల్లూరులోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు

తగ్గని అంగన్‌వేడి!

- కొనసాగుతున్న ఆందోళనలు
- ప్రభుత్వం నోటీసులు ఇవ్వడంపై ఆగ్రహం

నెల్లూరు (వైద్యం), జనవరి 2 : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె మంగళవారం నాటికి 22వ రోజుకు చేరుకుంది. నెల్లూరు నగరంలోని ఐసీడీఎస్ జిల్లా కార్యాలయంలో అంగన్‌వాడీలు ధర్నాను కొనసాగించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు మోహన్‌రావు మాట్లాడుతూ అంగన్‌వాడీల డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గ్యాట్యూటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని వెల్లడించారు. ఈ నెల 5వ తేదీలోపు విధుల్లో చేరాలని అంగన్‌వాడీలకు నోటీసులు జారీ చేయడం ఏమిటంటూ దుయ్యబట్టారు. ఈ నిరసనలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు సునీత, రజనీ, రమ, సుజాత తదితరులు పాల్గొన్నారు. కాగా, ఉలవపాడులో అంగన్వాడీలకు కందుకూరు టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు రూ.20 ఆర్థిక సాయం అందజేశారు. ఇక కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, వరికుంటపాడు, కోవూరు, ఉలవపాడు తదితర ప్రాంతాల్లోనూ అంగన్వాడీలు ఆందోళన కొనసాగించారు.

'పండగ' పేరుతో పింఛను ఆలస్యం

- అవ్వాతాతలు, ఒంటరి మహిళలకు అందని పెన్షన్
- సర్వేపల్లి, కందుకూరులో మాత్రమే పంపిణీ

ప్రతి నెలా ఒకటో తేదీన ఇచ్చే సామాజిక పింఛన్ల పంపిణీ ఈ నెల ఆలస్యమవుతోంది. రెండో తేదీ దాటినా రెండు నియోజకవర్గాల్లోనే వీటిని ప్రారంభించారు. దీంతో కొత్త ఏడాది ఒకటో తేదీన అవ్వాతాతలు పింఛను అందుకోలేకపోయారు.

నెల్లూరు(హరనాథపురం), జనవరి 2 : సాధారణంగా ప్రతినెలా ఒకటో తేదీన పింఛను పంపిణీ ప్రారంభించి ఐదో తేదీతో ముగిస్తారు. అయితే ఇప్పటి వరకు ఇస్తున్న పింఛను మొత్తాన్ని రూ.2750 నుంచి రూ.3వేలకు పెంచడంతో దానిని ప్రచారం చేస్తూ పండుగ వాతావరణంలో ఎమ్మెల్యేల ద్వారా పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో 8వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుందని అధికారికంగా ప్రకటించినా 10, 12 తేదీల వరకు సాగే పరిస్థితి కనిపిస్తోంది. అదీకాక, జిల్లావ్యాప్తంగా ఒకేసారి కాకుండా ఎమ్మెల్యేలు వారికి కేటాయించిన తేదీల్లో పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. మంగళవారం సర్వేపల్లి, కందుకూరు నియోజకవర్గాల్లో మాత్రమే పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పొదలకూరు ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీ ప్రారంభించారు. కందుకూరు రూరల్‌లో ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి పింఛన్లు అందజేశారు. కాగా, కందుకూరు అర్బన్‌లో, నెల్లూరు నగర నియోజకవర్గంలో బుధవారం పెన్షన్ల పంపిణీ మొదలుకానుంది. ఆత్మకూరులో ఈ నెల 5న, కోవూరులో ఈనెల 6న, నెల్లూరు రూరల్‌లో 8వ తేదీన... ఇలా ఒక్కో నియోజకవర్గంలో వేర్వేరు తేదీల్లో పింఛన్లు అందజేయనున్నారు. జిల్లాలో 3,21,325 మంది పెన్షన్‌దారులకు రూ.96.20కోట్లు వైఎస్ఆర్ పెన్షన్ కానుకగా పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వ నిర్ణయంతో ఈ నెల ఎప్పటికి పింఛను అందుతుందో అనే ఆందోళన లబ్ధిదారుల్లో నెలకొంది.



సవాలక్ష నిబంధనలు

సంగం : కొత్త పింఛన్ పొందేందుకు ప్రభుత్వం సవాలక్ష నిబంధనలు విధించడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొంది. గతంలో పింఛన్ కోసం ఆధార్, బియ్యం కార్డులతోపాటు ఆధార్, కుల ధ్రువీకరణ, ఆదాయ పత్రాలను అందించేవారు. అయితే, ఈసారి గతంలో చేసే నకళ్లతోపాటు విద్యుత్ మీటరు బిల్లు, ఓటరు కార్డులను జతపర్చాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ మేరకు ప్రజలు దరఖాస్తులు చేశారు. అయితే, పింఛన్ల మంజూరుపై ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. సచివాలయంలోని లాగిన్‌లో లబ్ధిదారుడి వివరాలు సేకరించిన తరువాత పింఛన్ మంజూరుకు ఎంపీడీవో లాగిన్‌కు సిఫారసు చేశారు. వాటిని ఎంపీడీవో పరిశీలించిన తరువాత ఆయా దరఖాస్తులను అమరావతిలో సెర్ప్ కార్యాలయానికి పంపించారు. పింఛన్ల మంజూరు అక్కడే జరగాల్సి ఉంది. అయితే జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో దీనికి సంబంధించి ఎటువంటి వివరాలు లేవు. ఆన్‌లైన్‌లో నమోదైన దరఖాస్తుదారుల వివరాలు ప్రస్తుతం కంప్యూటర్‌లో కనిపించడం లేదు. దీంతో పింఛన్లు ఎవరికి మంజూరవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. కాగా, కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఎరువుల కొరత తీరిందోచ్!

కోవూరు, జనవరి 2 : జిల్లా రైతాంగానికి శుభవార్త. ఎరువుల కొరత తీర్చేలా జిల్లాకు 49వేల మెట్రిక్ టన్నుల రసాయనిక ఎరువుల బస్తాలు రైల్వే వ్యాగిన్లలో కోవూరు మండలం పడుగుపాడు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాయి. స్టేషన్ యార్డు నుంచి లారీల్లో ఆర్బీకేలకు తరలిస్తున్న ఎరువుల బస్తాలను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారంలోగా మరో 10వేల మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు రానున్నాయని చెప్పారు. ఆర్బీకేలలో స్టాక రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి కూడా పరిశీలనలో ఉన్నారు.



కొలువుదీరిన ముగ్గురమ్మలు

ముగ్గురమ్మల తిరునాళ్ల

- గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మలకు గ్రామోత్సవం
- అల్లూరుకు పోటెత్తిన భక్తజనం

గొడ్డందు.. బిడ్డందు.. పాడందు.. పంటందు.. అంతా సుఖంగా చూసుకునే గంగమ్మకు, కలుగోళమ్మకు, పోలేరమ్మకు తిరునాళ్లహో.. అంటూ రెండు చాటింపుల అనంతరం మూడో చాటింపుగా మంగళవారం అల్లూరులో గ్రామదేవతలకు తిరునాళ్లను నిర్వహించారు. అక్కాచెలెళ్లు అయిన శక్తి దేవతలకు అల్లూరు ప్రజలు మంగళవారం చల్ది నైవేద్యాన్ని ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యం వహించగా కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు కార్యక్రమాన్ని చేపట్టారు. చల్ది నైవేద్యాన్ని సమర్పించేందుకు ఇంటింటా శోభను నింపే పసుపు రంగు మట్టి కుండల్లో చల్ది నింపి 1001 మంది మహిళలు తలపై పెట్టుకుని ఊరేగింపుగా విష్ణువర్ధన్ రెడ్డి ఇంటికి చేరుకున్నారు. అక్కడి నుంచి విష్ణు సతీమణి శివప్రియతో బయలుదేరి పోతురాజుకు నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవార్లకు అభిషేకం, కుమ్మరి వారి సంప్రదాయ అఖండ ప్రతిష్ఠ, సాయంత్రం రత్నాలంకారం, బంగారు చీరలో పోలేరమ్మ ప్రత్యేక దర్శనం, విశిష్ట పూజలు, రాత్రి అమ్మవార్లకు ప్రత్యేక పూలాలంకరణ జరిగింది. తప్పెట్లు, తీన్‌మార్, మంగళవాయిద్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవార్ల గ్రామోత్సవం సాగింది. ఆయా కార్యక్రమాల్లో ఆచారంగా వస్తున్న వీరతాళ్లు, గంగపెట్టె తదితర సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తజనం పోటెత్తింది.

- అల్లూరు



పసుపు కుండల్లో చల్ది నైవేద్యాన్ని తీసుకెళ్తున్న మహిళలు

కనెక్షన్ కోసం కలెక్షన్!

- ఏసీబీ వలలో ట్రాన్స్‌కో సిబ్బంది
- వ్యవసాయ కనెక్షన్ మంజూరుకు నగదు డిమాండ్
- ఏసీబీ అధికారులను ఆశ్రయించిన రైతు
- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఇన్చార్జి ఏఈ, మరో ఇద్దరు ఉద్యోగులు

జలదంకి, జనవరి 2 : వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఓ రైతు వద్ద నగదు తీసుకుంటూ ట్రాన్స్‌కో ఏఈతో పాటు మరో ఇద్దరు ఉద్యోగులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే.. కావలికి చెందిన రైతు దివి నరసింహారావుకు జలదంకి మండలం తిమ్మసముద్రంలో వ్యవసాయ భూమి ఉంది. తన వ్యవసాయ బోరుబావికి విద్యుత్ కనెక్షన్ కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే, కనెక్షన్ ఇవ్వాలని మూడు నెలలుగా ట్రాన్స్‌కో సిబ్బంది చుట్టూ తిరుగుతున్నా వారు పట్టించుకోలేదు. దీంతో విసిగెత్తిన నరసింహారావు సదరు సిబ్బందిని నిలదీయడంతో నగదు డిమాండ్ చేశారు. చివరకు వారితో రూ.20వేలు లంచం ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్న రైతు నెల్లూరులోని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు ఇచ్చిన నగదును మంగళవారం ఉదయం జలదంకి సబ్‌స్టేషన్‌లో ఉన్న ఇంచార్జి ఏఈ చంద్రశేఖర్, తిమ్మసముద్రం సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ వాకా అశోక్‌కుమార్‌లకు నగదు ఇవ్వబోగా వారి సూచన మేరకు అక్కడే ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సానా ఏడుకొండల సాంబశివరావుకు నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడులు చేశారు. ఏసీబీ డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్ తన సిబ్బందితో కలిసి ఏఈని ఇద్దరు ఉద్యోగులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి వివరాలను రాబట్టేందుకు సాయంత్రం వరకు సబ్‌స్టేషన్ వద్దే ఉండి విచారించారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు శ్రీనివాస్, విజయ్‌కుమార్ కిరణ్, అంజనేయరెడ్డి తదితరులు ఉన్నారు. కాగా, ఎన్నడూలేని విధంగా ఏసీబీ అధికారులు దాడులు చేయడంతో మండల కేంద్రమైన జలదంకిలో కలకలం రేగింది.



లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ట్రాన్స్‌కో సిబ్బంది

ఉరితాడే శరణ్యం!

కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఏ సిబ్బంది సమ్మె



నెల్లూరు (విద్య) : తమకు ఇచ్చిన హామీని అమలు చేయాలని కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, తమకు ఇక ఉరితాళ్లే శరణ్యమని సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం ఉరితాళ్లు మెడకు వేసుకుని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయడంతోపాటు హెచ్ఆర్‌సీ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 5వ తేదీన విజయవాడలోని ఎస్‌పీడీ కార్యాలయాన్ని ముట్టడించి తామేంటో ప్రభుత్వానికి చూపుతామని హెచ్చరించారు. ఈ నిరసనలో జేఏసీ నాయకులు విష్ణువర్ధన్ రావు, సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే!

- మున్సిపాలిటీల్లో పేరుకుపోతున్న చెత్త

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పారిశుధ్య కార్మికులు సమ్మెలోకి దిగడంతో మున్సిపాలిటీల్లో చెత్తాచెదారం పేరుకుపోతోంది. శాశ్వత, ప్రత్యామ్నాయ కార్మికులతో చెత్తను తొలగిస్తున్నా ప్రధాన కూడళ్లలో మాత్రం కుప్పలు పేరుకుపోయాయి. సమ్మెలోకి దిగి ఎనిమిది రోజులు గడుస్తున్నా ప్రభుత్వ పెద్దల్లో చలనం లేక పోవడంపై కార్మిక సంఘాలు భగ్గుమంటున్నాయి.

నెల్లూరు (సిటీ), జనవరి 2 : పారిశుధ్య కార్మికుల సమ్మెతో నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో చెత్త పేరుకుపోతోంది. తాగునీటి విభాగం, వీధిలైట్ల కార్మికులు సుమారుగా 200 మంది మినహా మిగిలిన అన్ని విభాగాల్లోని 1,440 మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు. 270 మంది శాశ్వత కార్మికులతో ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కింద చెత్తను సమీకరిస్తున్నారు. 54 డివిజన్ల నుంచి నిత్యం 300 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా కార్మికుల కొరతతో 70 టన్నుల వరకు డంపింగ్ యార్డులకు చేర్చుతున్నారు. నివాసాల మధ్య చెత్తను సేకరించడం ఆపేసిన అధికారులు, ప్రధాన రోడ్లు, కూడళ్ల వద్ద మాత్రమే చెత్తను తరలిస్తున్నారు.

కావలిలో అదనపు సిబ్బంది..

- కావలి : పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం దర్శనమిస్తోంది. 34 మంది శాశ్వత, 241 మంది కాంట్రాక్టు ప్రాతిపదికన కార్మికులు పని చేస్తున్నారు. వీరు సరిపడక అవసరం మేరకు దినసరి వేతనంపై కార్మికులను నియమిస్తుంటారు. పట్టణ పరిధిలో రోజుకు 60 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. కాగా, మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులలో ఓ యూనియన్‌కు చెందిన సుమారు 100 మంది సమ్మెలోకి వెళ్లారు. మూడు రోజులుగా వీరు చేసే పనులు ఆగిపోవటంతో పట్టణంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. చెత్త వాహనాలు నడిపేందుకు ప్రైవేటు వ్యక్తులను నియమించారు. అలాగే అదనంగా 20 మంది దినసరి వేతనం కింద నియమించినట్లు కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు.
- ఆత్మకూరు : మున్సిపల్ పరిధిలో 74 మంది కార్మికులు విధులు నిర్వహిస్తుండగా 29 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన 45 మంది సమ్మెలో ఉండటంతో పలు ప్రదేశాల్లో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయింది. ప్రతి రోజూ 16 టన్నుల మేర చెత్త సేకరించాల్సి ఉంది. దీంతో అధికారులు 20 మందిని ఒప్పంద పద్ధతిలో తీసుకుని చెత్తను తరలిస్తున్నారు. అయినా 7 టన్నుల మేర చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది.



ఆత్మకూరు : టెలికం కార్యాలయ సమీపంలో...



నెల్లూరు: ఎంవీ అగ్రహారంలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త



కావలి క్రిస్టియన్ పేటలో..



నెల్లూరులో రోడ్డుపైకి చేరిన చెత్తాచెదారం

పొగతోటలో ఉద్రిక్తత

- ప్రైవేట్ వారిని అడ్డుకున్న పారిశుధ్య కార్మికులు
- పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నెల్లూరు (సిటీ), జనవరి 2 : ఉద్యోగ భద్రత కల్పిస్తూ క్రమబద్ధీకరణ చేయాలన్న ఏకైక డిమాండ్‌తో సమ్మెలోకి దిగిన పారిశుధ్య కార్మికులకు పోటీగా కార్పొరేషన్ అధికారులు ప్రైవేట్ కార్మికులను రంగంలోకి దింపారు. మంగళవారం పొగతోటలోని మూడు హోళ్ల కూడలి వద్ద విధుల్లో ఉన్న ప్రైవేట్ కార్మికులను సమ్మెలోని పారిశుధ్య కార్మికులు అడ్డుకున్నారు. ఇరువురి మధ్య వాగ్వివాదం తలెత్తడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. చెత్తను తరలించేందుకు వీల్లేదంటూ వాహనాలను ఆందోళనకారులు అడ్డుకోవడంతో పోలీసులు రంగంలోకి దిగారు. పలువురిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. సమాచారం అందుకున్న కమిషనర్ వికాస్‌మర్మత్ ఘటనాస్థలికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చెత్త తరలింపును అడ్డుకోవద్దని సూచించారు. కాగ పోలీసులు అదుపులోకి తీసుకున్న కార్మికులను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.



పోలీసులతో మాట్లాడుతున్న కమిషనర్ వికాస్

నా భూమిలోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారయ్యా!

● నెల్లూరు కలెక్టరేట్ ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు వెంకట్రామయ్య

నెల్లూరు (హరనాథపురం) : తన భూమిలోకి తనను వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారంటూ నెల్లూరు కలెక్టరేట్ ఎదుట మంగళవారం ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. జలదంకి మండలం మద్దూరుపాడుకు చెందిన రైతు వెంకట్రామయ్య తన తలపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకునే క్రమంలో స్థానికులు అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. బాధితుడి కథనం మేరకు.. జలదంకిలో సర్వే నెం.111 4-313లో 1.41 ఎకరాల భూమి ఉందని వెంకట్రామయ్య చెప్పుకొచ్చారు. అయితే, ఆ భూమిని తాము కొనుగోలు చేశామంటూ పూనూరు వెంకట పద్మావతి, ఈమె భర్త వీఆర్వో పూనూరు రామకృష్ణారెడ్డిలు తన భూమిలోకి తనను వెళ్లనీయకుండా అడ్డుకోవడమేగాక రౌడీలతో దాడి చేయించారని కన్నీటి పర్యంతమయ్యారు. జలదంకిలో వీఆర్వోగా పనిచేసిన సమయంలో రామకృష్ణారెడ్డి 1బీ, అడంగల్‌లో తన పేరు తొలగించి, ఆయన భార్య వెంకట పద్మావతి పేరును చేర్చాడని ఆరోపించారు. దీనిపై తహసీల్దారు, పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని వాపోయారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ హరినారాయణన్ వెంటనే స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో డీఆర్వో లవన్న రైతు వెంకట్రామయ్యను కలిసి వివరాలు సేకరించాడు. వెంటనే సమగ్ర నివేదిక ఇవ్వాలని కావలి, ఆర్డీవోలతోపాటు జలదంకి తహసీల్దారును ఆదేశించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సంగం, జనవరి 2: స్థానిక ఆర్యవైశ్య బజారులో తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాల మేరకు, ఆర్యవైశ్య బజారులో శ్రీరామ్ అరుణమ్మ ఒంటరిగా నివాసం ఉంటోంది. ఇంటికి తాళం వేసి ఆమె ఇటీవల బంధువుల ఊరికి వెళ్లింది. ఈ క్రమంలో మంగళవారం ఇంటి ఎదురుగా ఉన్న వారు తాళం గొళ్లెం ఊడిపోయి ఉండటాన్ని గమనించారు. బయటి నుంచి లోపల తలుపు తాళాలు పరిశీలించగా పగలకొట్టి ఉన్నాయి. దీంతో వారు అరుణమ్మకు సమాచారం ఇచ్చారు. ఎప్పుడు చోరీ జరిగిందో ఆమె ఊరి నుంచి వస్తేకాని తెలియదు. పోలీసులకు కూడా స్థానికులు సమాచారం అందించారు.

అనధికార మద్యం విక్రయాలపై దాడులు

నెల్లూరు(క్రైం), జనవరి 2: నెల్లూరులోని వేర్వేరు ప్రాంతాల్లో అనధికార మద్యం విక్రయాలపై చిన్నబజారు పోలీసులు మంగళవారం దాడులు చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. శివగిరికాలనీకి చెందిన ముత్తు కొంతకాలం గా ఇంటివద్దనే మద్యం విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారం అందుకున్న చిన్నబజారు ఎస్ఐ సైదులు మంగళవారం సాయంత్రం తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ముత్తు వద్ద 16 క్వార్టర్ సీసాల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇరగాళమ్మ సంఘం సమీపంలో సత్తురాజు చిల్లర దుకాణం నిర్వహిస్తూ అందులోనే మద్యం విక్రయిస్తున్నట్లు తెలుసుకుని పోలీసులు దాడి చేశారు. సత్తురాజును అరెస్ట్ చేసి దుకాణంలోని 12 క్వార్టర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ప్రశ్నించినందుకు ఒకరిపై దాడి

నెల్లూరు(క్రైం) జనవరి 2: బైక్‌తో ఢీకొట్టి ప్రశ్నించినందుకు వ్యక్తిపై ఓ నిందితుడు దాడి చేసి గాయపరిచాడు. బాలాజీనగర్ పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని ఎన్‌టీఆర్ నగర్ పిండిమిల్లు సమీపంలో సెల్‌ఫోన్ వ్యాపారి శివకుమార్ నివసిస్తున్నాడు. ఆయన ఈ నెల 1వ తేదీ చికెన్ కోసం ఇంటి నుంచి బాలాజీనగర్‌కు వెళుతుండగా ఏసీనగర్‌లో మహాలక్ష్మమ్మ గుడి సమీపంలో అతని బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తి బైక్‌తో వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఎందుకు ఢీ కొట్టావని ప్రశ్నించిన శివకుమార్‌పై అతడు దాడిచేసి గాయపరిచాడు. బాధితుడు జీజీహెచ్‌లో చికిత్స కోసం చేరి అక్కడి నుంచి ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. బాలాజీనగర్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయడంతో వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంట కాలువలో కారు బోల్తా

సంగం, జనవరి 2: మండల పరిధిలోని దువ్వూరు - బుచ్చి మధ్య మంగళవారం తెల్లవారుజామున ఓ కారు అదుపుతప్పి పంట కాలువలో బోల్తా పడింది. కడప జిల్లా బద్వేలు నుంచి నెల్లూరుకు వస్తున్న కారు మార్గమధ్యంలో దువ్వూరు సమీపంలో డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో రోడ్డు పక్కన ఉన్న పంట కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందలేదు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	115
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	230
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6061
వెండి కిలో ధర	రూ. 76,500
వెండి ఒక గ్రాము	రూ. 78.50

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆత్మకూరు, జనవరి 2 : పట్టణంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఆత్మకూరు మండలం నువ్వూరుపాడుకు చెందిన దేవరపల్లి శ్రీకాంత్(24) స్కూటీపై నెల్లూరుపాళెం వైపు వెళుతుండగా వెంకన్న పెట్రోల్ బంకు సమీపంలో రివర్స్ చేసుకుంటున్న లారీ ఢీ కొంది. దాంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం నెల్లూరులోని బొల్లినేని ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. శ్రీకాంత్ ఆటో నడుపుకుంటూ జీవించేవాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

‘ఆరోగ్య సురక్ష’ను విజయవంతం చేయండి

● హెల్త్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి

నెల్లూరు (వైద్యం), జనవరి 2 : జగనన్న ఆరోగ్య సురక్ష పథకం రెండో విడత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య ఆరోగ్యశాఖ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి ఆదేశాలు జారీ చేశారు. మంగళ వారం నెల్లూరు జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ‘సురక్ష’ మొదటి విడతలో మంచి ఫలితాలు సాధించారన్నారు. అదే తరహాలో రెండో విడతలోనూ ఆరోగ్య శిబిరాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కుష్ఠువ్యాధి సర్వేను పక్కాగా చేపట్టాలన్నారు. కొత్త కేసులు గుర్తిస్తే వెంటనే వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందేలా చూడాలని సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలీ, మున్సిపల్ హెల్త్ అధికారి డాక్టర్ వెంకట రమణ పాల్గొన్నారు.

డీహెచ్‌ని కలిసిన పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్

హెల్త్ డైరెక్టర్ పద్మావతిని ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం నాయకులు కలిశారు. పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అమరేంద్రనాథ్‌రెడ్డి, కోశాధికారి రవీంద్ర నాథ్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి అహ్మద్‌బాబు, కార్య నిర్వాహణ కార్యదర్శి బాలచంద్రబాబు, పబ్లిసిటి సెక్రటరీ నరసింహారావు పాల్గొన్నారు.

రేపు అనఘాష్టమి

నెల్లూరు (సాంస్కృతికం) : మార్గశిర బహుళ అష్టమి (అనఘాష్టమి) సందర్భంగా గురువారం కొండాయపాళెం గేట్ సుజాతమ్మ నగర్‌లోని అష్టలక్ష్మీ ఆలయంలో అనఘాష్టమి వ్రతం జరుగుతుందని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ సర్వేపల్లి అజయ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దత్తాత్రేయ స్వామికి ప్రీతి పాత్రమైన ఈ వ్రతం ఉదయం 9గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

భీమవరం ఘటనలో నిందితుల అరెస్టు

ఆత్మకూరు, జనవరి 2: మర్రిపాడు మండలం భీమ వారంలో గత గురువారం భూవివాదమై జరిగిన హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ కోటారెడ్డి తెలిపారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. భీమవరంలో కొంతకాలంగా భూవివాదం ఉండటంతో గత నెల 28న విచారణకు రెవెన్యూ అధికారుల పొలంలోకి వెళ్లారు. అక్కడ ఇరువర్గాలు ఘర్షణ పడగా, ఇరుపక్షాల వారికి గాయాలయ్యాయి. ఎలాగైనా తాను ఆ భూమిని దక్కించుకోవాలని ప్రయత్నంలో భాగంగా మందా రఘురామిరెడ్డి ముందుగా అక్కడకు తీసుకువచ్చిన కేజీవీల్స్ ట్రాక్టర్‌తో మందా రామరత్నా రెడ్డిని, ఆయన కుమారులు రామచంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డిలను ట్రాక్టరుతో ఢీకొట్టి చంపేందుకు తరుముకున్నాడు. మొదట రామరత్నా రెడ్డిని తొక్కించి, అడ్డుగా వచ్చిన ట్రాక్టరు డ్రైవర్ మూలి శ్రీనివాసులు రెడ్డిలను తొక్కించి చంపాడు. అనంతరం అక్కడ నుంచి పారిపోయాడు. ఈ కేసులో నిందితులయిన మందా రఘురామిరెడ్డి, ఆయన భార్య సునీత, వదిన లక్ష్మీలను ఏఎస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో ఆత్మకూరు సీఐ వేణు, మర్రిపాడు ఎస్ఐ విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

9 నెలలు.. 156 రిజిస్ట్రేషన్లు!

● సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లపై ఆసక్తి చూపని ప్రజలు

● డాక్యుమెంట్లకు భద్రత ఉండదనే అనుమానం

నెల్లూరు (హరనాథపురం), జనవరి 2 : సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఈ ఏడాది మార్చి 25వ తేదీన సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించినా ఇప్పటివరకు కేవలం 156 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి. అదికూడా వీలునామా వంటి రిజిస్ట్రేషన్లే ఎక్కువ. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి దస్తావేజుల రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనేది అనాదిగా వస్తోంది. అయితే, సచివాలయాల్లోనూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. అయితే, సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకొంటే చెల్లుబాటు అవుతాయా!? లేదా? అనే మీమాంసలో ప్రజలు ఉన్నారు.

● రికార్డుల సమస్య

చాలా కట్టుదిట్టమైన భద్రత మధ్య సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దస్తావేజుల రికార్డులను భద్రపరుస్తారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో రికార్డులు చాలా ముఖ్యమైనవి. అందులో వేలిముద్రల రిజిస్టర్ అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంది. దస్తావేజుల రిజిస్ట్రేషన్ తరువాత రిజిస్ట్రేషన్ రికార్డులు, దస్తావేజుల నకళ్లు తదితరాలను భద్ర పరచాల్సి ఉంటుంది. ఉదాహరణకు నెల్లూరులోని రిజిస్ట్రార్ కార్యాలయంలో 1965 నాటి దస్తావేజుల రికార్డులు అత్యంత భద్రంగా ఇప్పటికీ ఉన్నాయి. ఈ రికార్డుల స్ట్రాంగ్ రూమ్ తాళాలు, ఉన్నతాధికారుల వద్ద అత్యంత భద్రంగా ఉంటాయి. అలాంటి భద్రత సచివాలయాల్లో కరువయ్యింది. రికార్డుల భద్రతకు ఏ నిబంధనలు పాటిస్తున్నారో అధికారులు చెప్పలేని పరిస్థితి.



● వసతులూ కరువే!

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల వ్యవహారాలకు సంబంధించి కనీస మౌలిక వసతులు లేవు. కంప్యూటర్లు, రికార్డులు భద్రత పరచుగది, సేఫ్ లాకర్లు లేవు. కనీసం వాచ్‌మన్ కూడా లేడు. రిజిస్ట్రేషన్ చేసిన సచివాలయ అధికారి ఆ దస్తావేజులను ఎక్కడ భద్రత పరుస్తారు. వాటిని ఎవరైనా తస్కరిస్తే జవాబుదారీతనం ఎవరు అనే ప్రశ్నలకు కూడా సరైన సమాధానాలు లేవు. అనాదిగా, సంప్రదాయంగా వస్తున్న రిజిస్ట్రేషన్ శాఖలో రిజిస్ట్రేషన్లపై చూపుతున్న ఉత్సాహం, సచివాలయ రిజిస్ట్రేషన్లపై ప్రజలు చూపడం లేదు. మరోవైపు రీసర్వే జరిగిన ప్రాంతాల్లో రైతులకు సంపూర్ణ హక్కు పత్రాలు ఇంకా అందలేదు. ల్యాండ్ పార్శిల్ నెంబరు (ఎల్‌పీ) ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేయాలని చెబుతున్నా, దీనిపై సబ్ రిజిస్ట్రార్లకు, సచివాలయ ఉద్యోగులకు పెద్దగా అవగాహన లేదు. దీంతో వారు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని ప్రజలను ప్రోత్సహించలేక పోతున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలోని 118 సచివాలయాల్లో దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించామని, అన్నింటి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు చెప్పుకొచ్చారు.

ఓటర్ల జాబితాలో ఫొటోమార్పులు, తప్పులు సరి చేయాలి

నెల్లూరు (హరనాథపురం), జనవరి 2 : ఓటర్ల జాబితాలో ఫొటో మార్పులు, వివరాల తప్పులను సరిచేయాలని ఈఆర్వో, ఏఈఆర్వోలను కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. వారితో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల అధికారులందరూ తమ పరిధిలోని సెక్టార్ అధికారులతో కలసి ప్రతి పోలింగ్ కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించా. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, తాగునీటి వసతి, విద్యుత్, మరుగుదొడ్ల వసతి వంటి కనీస సౌకర్యాల వివరాలను ఈఆర్వో యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఒకే ఫార్మేట్లో పోలింగ్ కేంద్రాల నెంబర్లు, అసెంబ్లీ నియోజకవర్గాల నంబర్లు ముద్రించాలన్నారు.

ఇద్దరు అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

షోకాజ్ నోటీసులకు ఆదేశం ● దువ్వూరులో ఆరోగ్య సురక్ష శిబిరం పరిశీలన



ఎంపీడీవో గోపీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ హరినారాయణన్

సంగం, జనవరి 2: ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాట్లలో నిర్లక్ష్యంపై కలెక్టర్ హరినారాయణన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ సంగం వచ్చారు. మొదట ఆయన సంగం ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. వైద్యశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను గమనించి, పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించలేరా? అని తహసీల్దారును ప్రశ్నించారు. వైద్యశాల లోపల మరుగుదొడ్లు, ల్యాబ్ అపరిశుభ్రంగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం దువ్వూరులో జరుగుతున్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. గైనిక్ సమస్యలపై వచ్చే మహిళలను పరిక్షించే గదిలో కనీసం బల్ల ఏర్పాటు చేయకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో గోపికి, వైద్యాధికారి శ్రీనివాసులరెడ్డికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సస్పెండ్ చేస్తానని ఎంపీడీవోని హెచ్చరించారు. అనంతరం ప్రజలతో మాట్లాడారు. తదుపరి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య సురక్ష 2వ విడత కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెలో ఉండడంతో పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారం అందేలా ప్రత్యేక సిబ్బందిని నియమించామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పెంచలయ్య, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన, తహసీల్దారు నాగరాజు పాల్గొన్నారు.



కలుషిత నీరే దిక్కు !

ఉదయగిరి మండలంలోని పలు గ్రామాల ప్రజలు కలుషిత నీటిని తాగాల్సి వస్తోంది. నీటి ట్యాంకులను కొన్ని నెలలుగా శుభ్రం చేయకపోవడంతో పాచి పట్టిన, దుర్వాసన వెదజల్లే నీటిని తాగుతున్నారు. ఉదయగిరి ఆనకట్టలోని నీరు పాచిపట్టి దుర్వాసన వస్తున్నాయి. వాటినే ప్రజలు తాగుతున్నారు. అలాగే మండలంలోని గడ్డంవారిపల్లి, సర్వరాబాదు, వెంగళరావునగర్, గండిపాళెం, శకునాలపల్లి, నేలటూరు తదితర గ్రామాల్లో కలుషిత నీరు సరఫరా అవుతోందని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

- ఉదయగిరి

డిగ్రీ పరీక్షలకు పది మంది గైర్హాజరు

వెంకటాచలం, జనవరి 2 : వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షలకు 10 మంది గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్. ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 67 మందిగాను 57 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

యానాదుల సంక్షేమం, అభివృద్ధి పట్టని ప్రభుత్వం

● గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటపతి

కావలి రూరల్, జనవరి 2: సమాజంలో వెనుకబడిన యానాదుల సంక్షేమం, అభివృద్ధి మాత్రం ప్రభుత్వానికి పట్టడం లేదని గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల వెంకటపతి ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ గిరిజన నాయకుడు పోట్లూరి వెంకటేశ్వర్లు, మత్స్యకార సొసైటి మాజీ అధ్యక్షుడు కోట్లూరు శంకరయ్య ఆధ్వర్యంలో మంగళవారం యానాది సంఘాల మహా కూటమి రాష్ట్ర సంఘాల నాయకులు మండలంలోని గౌరవరం గిరిజన కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటపతి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 180 యానాదుల కుటుంబాలు నివశిస్తున్నప్పటికి వారికి కనీసం పక్కాగృహాలు కూడా లేక పూరిగుడిసెల్లో మగ్గుతున్నారన్నారు. యానాదులకు చైతన్యం లేకపోవడంతో విద్యకు దూరమై ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన లేక అభివృద్ధికి ఆమడదూరంలో దుర్భరజీవనం గడుపుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు చిత్తశుద్ధితో యానాదుల కాలనీలను సందర్శించి సంక్షేమ పథకాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శాత్తుమురై

● రంగడి ఆలయంలో ముగిసిన అధ్యయనోత్సవాలు



నెల్లూరు (సాంస్కృతికం): నెల్లూరులోని తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు ఉదయం ధనుర్మాస పూజలు జరిగాయి. రాత్రి ఇయఱ్పా శాత్తుమురై వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాలకు ఉభయకర్తలుగా పీటీ గోపాలాచారి అండ్ సన్స్ వ్యవహరించారు. ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, ఈవో డీ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

మీరు మొండైతే.. మేము జగమొండి ! : రెహనాబేగం


మాట్లాడుతున్న రెహనాబేగం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 2: 'సీఎం జగన్‌మోహన్‌రెడ్డీ.. మీరు మొండైతే మేము జగమొండి. ఆడుదాం అంధ్రాకు, రిషికొండలో భవన నిర్మాణాలకు రూ.కోట్లు ఎక్కడ నుంచి వచ్చాయ్. మీ సలహాదారులకు రూ.లక్షల్లో వేతనాలు ఇస్తున్నావ్.. మాకు ఇచ్చేందుకు డబ్బులేవా ?'.. అంటూ అంగన్‌వాడీ వర్కర్స్‌, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుజాత, రెహనాబేగం పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట చేపట్టిన అంగన్‌వాడీల ధర్నాలో వారు మాట్లాడారు. వేతనాన్ని తెలంగాణ కంటే రూ.వెయ్యి పెంచమని అడుగుతున్నాం. చర్చల పేరుతో కాలయాపన చేయడం తగదు. అంగన్‌వాడీలకు తీపికబురు చెప్పు అని వారు కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గుజ్జుల మల్లికార్జున, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి : స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట మంగళవారం 22వ రోజు అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి రెహనాబేగం, సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు : సమ్మెలో భాగంగా బుధవారం చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్‌, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రెహనాబేగం అన్నారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ఆందోళనలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సుజాతమ్మ, మండల నాయకులు మట్టి హరినారాయణ, షేక్ రజియా పాల్గొన్నారు.

ఆత్మకూరు : తమ డిమాండ్లు నెరవేర్చే వరకు పోరు ఆగదంటూ అంగన్‌వాడీలు మంగళవారం సమ్మె కొనసాగించారు. ప్రజా సంఘాలు, రాజకీయ పక్షపార్టీలు వారికి మద్దతును ప్రకటించాయి. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు జి శివప్రసాద్, ఏ నాగయ్య, కే హజరత్తయ్య, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు పి రాధ, కె రమణమ్మ, కామేశ్వరీ, జమీల, విజయలక్ష్మి, రూతమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక ఎమ్మార్వో ఆఫీసు ప్రాంగణంలో మంగళవారం జరిగిన అంగన్‌వాడీల ధర్నాలో యూనియన్ జిల్లా కార్యదర్శి రెహనా బేగం, జిల్లా అధ్యక్షురాలు వై.సుజాతమ్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కోడె రమణయ్య, ఆదిలక్ష్మి,కుమారి, చంద్రమ్మ పాల్గొన్నారు.

అనంతసాగరం : స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట మంగళవారం అంగన్‌వాడీ సిబ్బంది గేయాలు ఆలపిస్తూ నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం చూపుతున్న మొండి వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాష, గద్దర్‌బాబు, వేము పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెలా 10లోపు రేషన్ సరుకుల పంపిణీ : జేసీ


సంగం : కార్డుదారులతో మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

సంగం, జనవరి 2: ప్రతి నెలా 10వతేదీలోపు ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీని పూర్తి చేయాలని జేసీ ఆర్ కూర్మనాథ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన సంగం తిరుమన తిప్ప ఎస్టీ కాలనీలో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ సరుకులు పంపిణీని పరిశీలించారు. కార్డుదారులతో మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 438 ఎండీయూ వాహనాలు ఉంటే 412 వాహనాల ద్వారా బియ్యం, కందిపప్పు, చక్కెర, గోధుమ పిండి పంపిణీ చేస్తున్నామన్నారు. కొందరు కార్డుదారులు వారికి ఉన్న సమస్య వల్ల కందిపప్పు తీసుకోవడం లేదని తెలిసిందన్నారు. ఆయన వెంట తహసీల్దారు నాగరాజు ఉన్నారు.

● **రీసర్వేను త్వరగా పూర్తి చేయండి**

ఏఎస్‌పేట : భూముల రీసర్వేను త్వరగా పూర్తి చేయాలని జేసీ ఆర్ కూర్మనాథ్ తెలిపారు.మంగళవారం ఆయన మండలంలోని పెదబ్బీపురం సచివాలయన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లడుతూ అవసరం అయితే అదనపు సిబ్బందిని నియమించుకుని, రీసర్వే వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం జగనన్న సురక్ష కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత,తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ఎంపీడీవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షితల అందజేత

ఆత్మకూరు : అయోధ్య నుంచి వచ్చిన అక్షితలను ప్రతి ఇంటికి చేర్చే క్రమంలో మంగళవారం ఆత్మకూరులోని పంటవీధిలో ప్రతి ఇంటికి వెళ్లి అందజేశారు. ముందుగా బీజేపీ నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు పంటవీధిలోని కోదండ రామాలయం వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు పుచ్చలపల్లి రాధిక, కొప్పోలు రమాదేవి, తోకల తిరుపతమ్మ, ఆలయ పూజారి నాగరాజుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరం : మండలంలోని సోమశిలలో మంగళవారం ఆయోధ్య రామమందిరం నుంచి పంపించిన పూజా అక్షితలను భక్తులు ర్యాలీ నిర్వహించి గ్రామస్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి ఆలయం ఫొటో పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కోదండ రామాలయ అర్చకులు శశిశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన

అనంతసాగరం: మండలంలోని లింగంగుంటలో మంగళవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో జీవన ఎరువుల వినియోగం, వాటి ఉపయోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆత్మ పీడీ దొరసానమ్మ మాట్లాడుతూ ఎరువుల వాడకంపై జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నత్రజని, భాస్వరం, పోటాషియం వాడకంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఏడీ దేవసేనమ్మ, మండల ఏవో శ్రీధర్ రెడ్డి, వీఏఏ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : మండలంలోని నర్రవాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం వెంగళరావు మెమోరియల్ ట్రస్టు తరపున విద్యా సామగ్రిని అందచేశారు. పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, మిగిలిన విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, విద్యా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో దాత పచ్చవ రాకేష్, విశ్రాంత డ్రాయింగ్ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు

ఉదయగిరి రూరల్ : పట్టణంలోని 1225 సర్వేనెంబరులో తమకు ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలను అక్రమించారని మంగళవారం పలువురు లబ్ధిదారులు తహసీల్దారు శ్రీనివాసులరెడ్డికి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ 2008లో ప్రభుత్వం ఎం.వహీదా, ఎం.సిరీని, ఎంఏ ఎగ్బాలున్నీబేగం, షేక్ జబీనా, ఎండీ అక్మల్, సింగనబోయిన రాజమ్మ తదితరులకు మూడుసెంట్ల స్థలం మంజూరు చేసిందన్నారు. ఇటీవల తాము ఇళ్లు నిర్మాణాలు చేపట్టేందుకు రెవెన్యూ అధికారులు హద్దులు చూపించగా అక్రమణకు గురైందని గుర్తించామన్నారు. అందులో ఓ వ్యక్తి జామాయిల్ సాగు చేస్తున్నారన్నారు. పరిశీలించి అక్రమణను తొలగించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ఉదయగిరి రూరల్ : మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఈవోపీఆర్డీ, సెక్టార్ అధికారి మల్లికార్జున తనిఖీ చేశారు. తొలుత ఆయన దుర్గంపల్లిలోని 53వ పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి మౌలిక వసతులను పరిశీలించారు.కార్యక్రమంలో బీఎల్‌వో వెంకట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఉదయగిరి నియోజకవర్గ ఈఆర్‌వో ప్రేమ్‌కుమార్ మంగళవారం మండలంలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. మండలంలోని సీతారామపురం, సంగసానిపల్లి,సింగారెడ్డిపల్లిలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో కే సుధాకర్ రావు, హౌసింగ్ ఏఈ రామకృష్ణరావు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ చెన్నరాయుడు, ఆర్‌ఐ శ్రీనివాసులు,వీఆర్వో మనోహర్ పాల్గొన్నారు.

జడదేవిలో వైద్య శిబిరం

వరికుంటపాడు : మండలంలోని జడదేవి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం కాకర్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఏనుగంటి చిన్నకొండయ్య, మక్కిన వెంకటరత్నం, గుర్రం గోపి, గుర్రం పుల్లయ్య, గుమళ్ల చిన్నచంచయ్య, కర్నాటి నాగయ్య, కామేపల్లి శ్రీనివాసులు, కే చిన్న వెంకయ్య పాల్గొన్నారు.

రేపు ఆలయ భూములకు కౌలు వేలం

చేజర్ల : మండలంలోని చిత్తలూరు చెన్నకేశవస్వామి, వీరభద్రస్వామి ఆలయాల భూములకు గురువారం ఉదయం 10గంటలకు పంచాయితీ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు ఈవో కే పెంచల వరప్రసాద్ తెలిపారు. మూడేళ్లపాటు కౌలుకు ఇచ్చేందుకు వేలం జరుగుతుందన్నారు.

5 నుంచి ఆరోగ్య సురక్ష

వరికుంటపాడు : మండలంలో ఈనెల 5 నుంచి రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ వైద్య శిబిరాలను విజయవంతం చేయాలన్నారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన


ఆందోళన చేస్తున్న మహిళలు

ఉదయగిరి రూరల్, జనవరి 2: తాగునీటి కోసం పట్టణంలోని దేవలాలగడ్డ ప్రాంతానికి చెందిన పలువురు మహిళలు మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ తమ ప్రాంతానికి 15 రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. షబ్బీర్ కాలనీలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీరు సరఫరా చేసే పైపులైన్ దెబ్బతినడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా మన్నారు. అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటిని అందించాలని కోరారు.

ఆశీర్వదిస్తే అందుబాటులో ఉంటా... !

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 2: వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దుత్తలూరులోని బీసీకాలనీ, యాదవ వీధుల్లో ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఏ.వెంకటేశ్వరరెడ్డి, గంగాధర్, జయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలోనే మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు, జనవరి 2: మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె మంగళవారం 8వ రోజుకు చేరింది. ఈ క్రమంలో వారు తమ విధులను బహిష్కరించి, మున్సిపల్ కార్యాలయం వద్ద ఒంటి కాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా సీఐటీయు, సీపీఎం నాయకులు జీ శివప్రసాద్, ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య, కే డేవిడ్‌రాజు పాల్గొని సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు జీ నాగేంద్ర, షేక్ రిజ్వాన్, గురునాథం, జీ రమణయ్య పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షకు విద్యార్థుల ఎంపిక

వింజమూరు : రాష్ట్రస్థాయి కౌశల్ ప్రతిభా పరీక్షకు మండలంలోని గుండెమడకల ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.శ్రీసాయి తన్మయి, ఏ.సాయితేజ, షణ్ముఖప్రియ, సీహెచ్. లాస్య ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు గోపిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆ యన ఆ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కె.రాము, శివ, కోటారెడ్డి, ఎం.మల్యాద్రి, ఎం.కోటేశ్వరరావు, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవమానాలకు గురి చేస్తున్నారు !

వింజమూరు : కొంతమంది తనను అవమానాలకు గురి చేస్తున్నారని ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ కే మాశిలామణి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మండల పరిషత్ నిధులతో హిందూనగర్‌కు సిమెంట్ రోడ్డు వేశారని తెలిపారు. ఆ సమయంలో తన ఇంటి వరకు రోడ్డు వేయకుండా వది లేశారన్నారు. తన పట్ల వివిక్ష చూపుతున్నారని జిల్లా కలెక్టర్, ఎస్పీకి తెలిపామన్నారు. తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

'సురక్ష'కు స్పందన అరకొరే !

ఉదయగిరి రూరల్, జనవరి 2: ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఉదయగిరి మండలం వెంగళరావునగర్, దుత్తలూరు మండలం భైరవరం సచివాలయాల పరిధిలో నిర్వహించిన సురక్ష కార్యక్రమానికి రోగులు నామమాత్రంగానే హాజరయ్యారు. రోగుల రిజిస్ట్రేషన్ కోసం సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. కొన్ని పంచాయతీల్లో సర్పంచులు తమవల్ల కాదని చేతులెత్తేయడంతో పంచాయతీ కార్యదర్శులు తమ జేబుల్లో నుంచి నగదును ఖర్చు చేస్తున్నారు. భైరవరం శిబిరాన్ని డ్వామా పీడీ వెంకట్రావు తనిఖీ చేసి ఓపీ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. ఆయా కార్యక్రమంలో ఎంపీడీవోలు ఈశ్వరమ్మ, సాయి ప్రసాద్, వైద్యులు వినీత, అయూబ్, వనజ, సర్పంచులు తిరుపతి, కల్పన పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

సీతారామపురం : ఎస్‌ఐ అనూషను మంగళవారం ఆమె నివాసంలో ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, వైసీపీ నాయకులు సుబ్బారెడ్డి, బాలినేని మాబయ్య, అయ్యవారిపల్లి సర్పంచి దుగ్గయ్య మర్యాద పూర్వకంగా కలిశారు.అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు.

ప్రజలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

ఆత్మకూరు : మండలంలోని చెర్లోయడవల్లిలో మంగళవారం ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి రెండో విడత ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్య శిబిరాన్ని, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం వైద్యులు ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందుల కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీ ఐజాక్‌ప్రవీణ్, సర్పంచులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

సీతారామపురం: స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యులు రోగుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా తగిన శ్రద్ధతో సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వప్న, వైసీపీ నేతలు సుబ్బారెడ్డి, బాలినేని మాబయ్య, అయ్యవారిపల్లి సర్పంచి దుగ్గయ్య, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

నీటి విడుదలపై అవగాహన

చేజర్ల : సోమశిల నీటి విడుదలపై మంగళవారం మండలంలోని నాగులవెల్లటూరులో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని, కొత్తగా వరినార్లు పోసుకోవద్దన్నారు. ఈనెల 15లోపు వరి నాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వీ శశిధర్, ఇరిగేషన్ ఏఈ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మర్రిపాడు : స్థానిక హైస్కూల్‌లోని 10వ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఆర్థికంగా సహకరించిన ప్రభుత్వ వైద్యురాలు శాంతిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో ధనలక్ష్మి, హెడ్మాస్టర్ పద్మ, యూటీఎఫ్ నాయకులు సుధాకర్, నాయబ్, మోహన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనం పెంచాలి

ఆత్మకూరు : ఉపాధి కూలీలకు తప్పనిసరిగా రోజుకు వేతనం రూ. 272 వచ్చేలా పని చేయించాల్సి ఉందని ఎంపీడీవో పీ ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మేట్‌లకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు ప్రభుత్వ నిర్దేశించిన 100 రోజులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శిరీషా తదితరులు పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

వీఐపీ మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఈసీగా జంషీర్

అల్లూరు: వీఐపీ మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా అల్లూరుకు చెందిన షేక్ జంషీర్ ఎంపికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు మంగళవారం తెలిపారు. జంషీర్ మాట్లాడుతూ తనకు ఈ పదవిని అందజేసిన జాతీయ డైరెక్టర్ కట్టడి ప్యారిస్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

జగన్‌ను ఇంటికి సాగనంపుదాం

● రామకృష్ణాపురంలో 'బాబు ష్యూరిటీ -భవిష్యత్‌కు గ్యారెంటీ'

లింగసముద్రం, జనవరి 2: రాష్ట్రాన్ని దోచుకుతింటున్న సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపాలని ప్రకాశం జిల్లా పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ, కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి లింగసముద్రం పంచాయతీ రామకృష్ణాపురంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీ పీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, నాయకులు గాలంకి ప్రసాద్, మద్దెల రామారావు, కండే మాలకొండయ్య, అడపా నర్సయ్య, బోడి సురేష్, ఎం మల్లికార్జున, ప్రభాకర్, వెంగళరావు, బచ్చు మాల్యాద్రి, చెంబేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ఆదుకున్నది చంద్రబాబే..

ఉలవపాడు : రాష్ట్రం విడిపోయి కష్టకాలంలో ఉన్నప్పటికీ అంగన్వాడీలకు రెండు పర్యాయాలు రూ.6000 జీతాలు పెంచి ఆదుకున్న ఘనత చంద్రబాబు నాయుడికే దక్కుతుందని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చారి ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఉలవపాడులోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద 22వ రోజు సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీల శిబిరాన్ని ఇంటూరి సందర్శించి సంఘీభావం తెలిపారు. ధర్నాలో పాల్గొంటున్న అంగన్‌వాడీల సాధారణ ఖర్చుల కోసం రూ.20,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో ఇంటూరి, నూకసాని

ఏపీ భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలి

● న్యాయవాదుల రాస్తారోకో, మానవహారం


రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు

కందుకూరు, జనవరి 2: భూ మాఫియాను పెంచి పోషించేలా సామాన్యుల ఆస్తులకు రక్షణ లేకుండా చేసేలా ఉన్న ఏపీ భూ హక్కుల చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కందుకూరులో న్యాయవాదులు మంగళవారం రాస్తారోకో చేశారు. ఈ చట్టాన్ని రద్దు చేయకపోతే అధికారం ఉ న్నవాళ్లది, దౌర్జన్యం చేయగలిగిన వారికి మాత్రమే ఆస్తులు మిగులుతాయని, సామాన్యు లంతా తమ ఆస్తులను వారికి అప్పజెప్పాల్సిన దయనీయ పరిస్థితులు వస్తాయని న్యాయ వాదులు ఆందోళన వ్యక్తం చేశారు. కందుకూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టుల ప్రాంగణం వద్ద నుంచి పోస్టాఫీసు సెంటర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించిన న్యాయవాదులు అనంతరం పోస్టాఫీసు సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మామిళ్లపల్లి మల్లికార్జున, సీనియర్ న్యాయవాది బెజవాడ కృష్ణయ్య చౌదరి, పెట్లూరి మురళి, న్యాయవాదులు సన్నెబోయిన శ్రీనివాసులునాయుడు, వలేటి శ్రీధర్ నాయుడు, చిడిపోతు హరికృష్ణ, తిరుమలరావు, సాయిశంకర్, మహేష్ పాల్గొన్నారు.

కావలి అభివృద్ధే లక్ష్యం : పసుపులేటి


పసుపులేటికి శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు

కావలి టౌన్, జనవరి 2 : కావలి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని పీఎస్‌ఆర్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని పీఎస్‌ఆర్ ట్రస్ట్ కార్యాలయంలో అభిమానులు ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపారు. తనపట్ల ఇంతటి అభిమానాన్ని చూపుతున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు రోజుల్లో కావలి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు. తాను పుట్టిన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు తాను రాజకీయాల్లోకి రావలసి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలసిన కోటపాటి జనార్దన్


చంద్రబాబుతో కోటపాటి

కందుకూరు, జనవరి 2: టీడీపీ అధినేత చంద్రబాబును మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కందుకూరు టికెట్ ఆశిస్తున్న కోటపాటి జనార్దన్ కలిశారు. కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గానికి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. పలు విషయాలను ఆయన చంద్రబాబుకు వివరించే ప్రయత్నం చేయగా మీ గురించి నాకు అంతా తెలుసు, ఇద్దరు ముగ్గురు ముఖ్యులు మీ గురించి చెప్పి ఉన్నారని చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు తెలిసింది. కొంత కాలం తరువాత నిర్ణయం తీసుకుందామని చెప్పినట్లు తెలిసింది. కాగా గత కొంతకాలంగా కందుకూరు నియోజకవర్గంపై దృష్టిపెట్టిన కోటపాటి జనార్దన్ ఇక్కడ సొంత కార్యాలయం కూడా నిర్మిస్తున్నారు.

22వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె


మాట్లాడుతున్న డాక్టర్ బెజవాడ రవికుమార్

కావలిటౌన్, జనవరి 2: అంగన్వాడీల సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరింది. ఐఎంఏ, జేవీవీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్, జేవీవీ జిల్లా బాధ్యులు జానకి రామ్, హరనారపరెడ్డి, నాయీ బ్రాహ్మణ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుటూరి బాలగురుస్వామి, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కాకి ప్రసాద్‌లు వేర్వేరుగా శిబిరం వద్దకు చేరుకుని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెనుబాపల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు మాధవరావు, కార్యదర్శి మాల్యాద్రి, చెన్నకేశవులు, బాలకృష్ణ, సీఐటీయూ నేతలు పెంచలయ్య, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఆకులు తింటూ పారిశుధ్య కార్మికుల నిరసన


ఆకులు తింటూ నిరసన తెలుపుతున్న కార్మికులు

కావలిటౌన్, జనవరి 2: నడుముకు ఆకులు కట్టుకుని, ఆకులు తింటూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు వినూత్న నిరసన తెలిపారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 8వ రోజుకు చేరింది. తినేందుకు తిండి లేదు కట్టుకునేందుకు బట్టలు లేవనే సందేశంతో కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేత పసుపులేటి పెంచలయ్య, యూనియన్ నేతలు తురకా శీనయ్య, బీ రమేష్, ఓ రమేష్, చిన్నమ్మ, రాజ్యలక్ష్మి, అనిత, రాజేశ్వరి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కందుకూరులో మున్సిపల్ కార్మికుల సమ్మె

కందుకూరు : రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా ఈనెల 3 నుంచి కందుకూరులో ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ కార్మికులు సమ్మెలో పాల్గొంటారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వై.ఆనంద్‌మోహన్ తెలిపారు. పారిశుధ్య కార్మికుల మస్టర్ ప్రదేశంలో మంగళవారం కార్మికసంఘం నాయకులు, ఏఐటీయూసీ నాయకులు సమావేశం నిర్వహించి బుధవారం నుంచి సమ్మెలో పాల్గొనాలని తీర్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాకుమాని రమణమ్మ, పులి నాగేశ్వరరావు, మెండా మహేంద్ర, జంగాల మహేష్ పాల్గొన్నారు.

7 నుంచి పోలేరమ్మ జాతర

కావలిటౌన్, జనవరి 2: పట్టణంలోని పాతూరులో వెలసివున్న నడివీధి పోలేరమ్మ జాతర ఈనెల 7వ తేదీ నుంచి ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించేందుకు ఆచారపు కర్తలు చాటింపు వేశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరం తొలి మంగళవారం ఆనవాయితీగా తాళ్లపాలెం సత్యం బృందంచే స్వచ్ఛందంగా మంగళవాయిద్యాల కచేరి నిర్వహించారు.

సామాజిక పింఛన్ల పంపిణీ

కందుకూరు, జనవరి 2: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం జరిగిన సామాజిక పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పెంచిన రూ.3 వేల పింఛన్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టరు జీ.విద్యాధరి, ఎంపీడీఓ విజయశేఖర్, ఎంపీపీ సుశీల, జడ్పీటీసీ తొట్టెంపూడి అనసూయ, ఏడీఏ అనసూయ, ఏఓ వి.రాము పాల్గొన్నారు.

నార్తుమోపూరులో పోలేరమ్మకు పొంగళ్లు


అశ్వ వాహనంపై పోలేరమ్మ

అల్లూరు, జనవరి 2 : మండలంలోని నార్తుమోపూరులో వెలసి ఉన్న పోలేరమ్మ ఆలయంలో మంగళవారం పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. ప్రతి ఏటా జనవరి మొదటి మంగళవారం నిర్వహించే తిరునాళ్లను పురస్కరించుకొని పోలేరమ్మ ఆయలంలో విశేష పూజలు నిర్వహించారు. పోతురాజుకు చల్ది నైవేద్యాన్ని సమర్పించిన అనంతరం అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యాన్ని సమర్పించారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రి అమ్మవారిని అశ్వవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

కావలి రూరల్, జనవరి 2: కావలి మండలం ఆముదాలదిన్నె నుంచి కోళ్లదిన్నె వరకు రూ.3.25 కోట్లతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఏఎంసీకి చెందిన రూ.23 కోట్లతో నియోజకవర్గంలోని కావలి, అల్లూరు, దగదర్తి, బోగోలు మండలాల్లో రోడ్లు అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థా నిక సర్పంచ్ ఊడా బ్రహ్మానందం, జడ్పీటీసీ జంపాని రాఘ వులు, ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల నెంబర్లు పంపిణీ

అల్లూరు : మండలంలోని తూర్పు గోగులపల్లిలో మంగళవారం లబ్ధిదారులకు జగనన్న ఇంటి పట్టాలకు సంబంధించిన నెంబర్లను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కావలి ఆర్డీవో శీనానాయక్, ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, జడ్పీటీసీ వేణమ్మ, నాయకులు నీలం సాయికుమార్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, కోమట్ల పవన్‌కుమార్, గుమ్మడి సురేంద్ర పాల్గొన్నారు.

వీఎస్‌యూ క్రికెట్ జోన్ విన్నర్, రన్నర్‌గా జేబీ, పీజీ కళాశాల జట్లు

కావలిటౌన్, జనవరి 2: విక్రమ సింహపురి యూనివర్శిటీ జోన్ క్రికెట్ విన్నర్‌గా జేబీ జట్టు, రన్నర్‌గా వీఎస్‌యూ పీజీ కళాశాల జట్టు నిలిచాయి. మంగళవారం పీజీ కళాశాలలో జరిగిన ఫైనల్స్‌లో జెబీ జట్టు కావలి పీజీ కళాకశాల జట్టుపై 20 పరుగుల తేడాతో విజయం సాధించి విన్నర్‌గా నిలిచింది. ముఖ్య అతిథులుగా ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, జేబీ వైఎస్ ప్రిన్సిపాల్ ఆర్ మాల్యాద్రి పాల్గొని విజేతలకు కప్పులు అందించి అభినందించారు. పీడీలు మణికంఠ, భాస్కర్‌రావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండరు ఆవిష్కరణ

కొండాపురం, జనవరి 2: ఏపీటీఎఫ్-1938 సంఘం క్యాలెండర్, డైరీని మంగళవారం మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవోలు ఆనందరావు, రవికుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆశాఖ రాష్ట్ర కౌన్సిలర్ జీ.చినబాబు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.నాగేశ్వరరావు, ఎం.పుల్లయ్య, కార్యదర్శులు జీ.మాల్యాద్రి, సుధీర్, వెంకటేశ్వర్లు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడవద్దు

కలిగిరి : ఎన్నికల్లో గ్రామాల్లో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సంతోష్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు మండలంలో తెల్లపాడులో మంగళవారం గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో పేకాట, కోడిపందేలు, బెల్టు షాపులు వంటి అసాంఘిక చర్యలపై తమకు సమాచారం అందించాలని కోరారు. శాంతిభద్రతల దృష్ట్యా నేర చరిత్ర కలిగిన వారిని బైండోవర్ చేస్తామని తెలిపారు.

సస్పెండ్ చేస్తా..

● తహసీల్దారు, పెనుబల్లి వీఆర్వోలపై కలెక్టర్ ఆగ్రహం



రైతులు అందజేసిన వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 2: నీపై చాలా ఆరోపణలున్నాయి.. నాకు అంతా తెలుసు.. ఇలాగే కొనసాగితే సస్పెండ్ చేసేస్తా.. నంటూ తహసీల్దారు వీరి సుధీర్‌పై, 20 రోజుల్లో సమస్యలు పరిష్కరించకుంటే నిన్నూ సస్పెండ్ చేస్తానని పెనుబల్లి వీఆర్వో పార్థసారధిపై జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని పెనుబల్లి హైస్కూల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. అక్కడికి చేరుకున్న రైతులు పలు భూ సమస్యలను, రీ సర్వేతో ఏర్పడిన సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. 6నెలలుగా సచివాలయం, తహసీల్దారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని కన్నీటిపర్యంతమవుతూవినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారంలో ఎందుకు నిర్లక్ష్యం అంటూ వీఆర్వోను ప్రశ్నించారు. 20 రోజుల్లో సమస్యలు పరిష్కారం కాకుంటే సస్పెండ్ తప్పదని తహసీల్దారు, వీఆర్వోలను హెచ్చరించారు. స్థానిక సర్పంచు పెంచలయ్య, ఎంపీటీసీ వినయ్‌నారాయణ యూరియా కొరత, రైతుల సమస్యలను విన్నవించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అక్టోబరులో తొలివిడత ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించామని, రెండో విడత మంగళవారం జిల్లాలో మొత్తం 17 గ్రామాల్లో నిర్వహించినట్టు తెలిపారు. అంతకుముందు డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య ఆరోగ్య సురక్ష శిబిరంలో నమోదైన రోగుల వివరాలు, పాల్గొన్న వైద్యులు, అందిస్తున్న సేవలు గురించి తెలుసుకున్నారు.

● ఏఈ సస్పెన్షన్‌కు ఆదేశం, హెచ్ఎం, ఎంఈఓలకు షోకాజ్ నోటీసులు

మినగల్లు హైస్కూల్లో నాడు-నేడు పనులు పరిశీలించిన కలెక్టర్ హరినారాయణన్ హైస్కూలు కాంపౌండ్ నిర్మాణం, ముందుకు సాగని పనులపై సీరియస్ అయ్యారు. ఏఈ సస్పెండ్‌కు సంబంధిత శాఖకు ఆదేశించారు. డీఈఓతో కలసి విద్యార్థులను టెన్త్ పరీక్షలకు సంసిద్ధతపై పరీక్షించి సరైన సమాధానం రాకపోవడంతో ఇద్దరు ఎంఈఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

కోవూరు, జనవరి 2: గాలికుంటు వ్యాధి నివారణకు మండల పరిధిలోని పాడి పశువులకు మంగళవారం టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కృష్ణమౌర్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో గాలికుంటు వ్యాధి ప్రబలకుండా రైతులందరూ తమ పశువులకు టీకాలు వేయించాల్సిందిగా కోరారు. కోవూరులో 85, లేగుంటపాడులో 45, వేగూరులో 46, విడవలూరు మండల పరిధిలోని దండిగుంటలో 47 పశువులకు టీకాలు వేసినట్లు వివరించారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 2: మిడ్‌డే మీల్స్ కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 5న విజయవాడలో నిర్వహించే ధర్నా కోసం చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ మల్లికార్జున పిలుపునిచ్చారు. ఈమేరకు మిడ్‌డే మీల్స్ కార్మికులు ఎంఈఓకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మిడ్‌డే మీల్స్ మండల కార్యదర్శి అన్నపూర్ణమ్మ, సునీత, నిర్మల, ఆదిలక్ష్మి, వెంకమ్మ, సౌభాగ్యం, లక్ష్మి , దిల్లాన్, బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జొన్నవాడ ఆలయంలో సంప్రోక్షణ

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 2: మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సంప్రోక్షణ, ఆలయశుద్ధి, కొలువులు నిర్వహించిన అనంతరం 12.40 గంటల నుంచి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించినట్టు ఆలయ ఈఓ వి.గిరికృష్ణ తెలిపారు. సోమవారం రాత్రి ఆలయం సమీపంలో ఓ వ్యక్తి మృతి చెందడంతో సోమవారం రాత్రి ఆలయం మూసివేశారు. తిరిగి సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

చేపలను మింగుతున్న తిమింగలాలు!



చేపలు పట్టేందుకు వల విసురుతున్న మత్స్యకారుడు

● బహిరంగ వేలంతో చెరువులపై హక్కులు
● పంచాయతీల ఖజానాకు జమకాని నగదు
● కొత్తవెల్లంటి రూ.29 లక్షలు, పాతవెల్లంటి రూ.10 లక్షల బకాయిలు
● నోటీసులిచ్చి, కేసుల నమోదుతో సరిపెట్టిన అధికారులు

నెల్లూరు(సిటీ), జనవరి 2 : చెరువుల్లో చేపల వేటను బహిరంగ వేలం ద్వారా దక్కించుకుంటున్న వారు ఆ నగదును పంచాయతీల ఖజానాకు జమ చేయకుండా మింగేస్తున్నారు. ఇలా లక్షలాది రూపాయలు బకాయిలు ఉన్నా సంబంధిత అధికారులు నోటీసులు ఇచ్చి, పోలీసులకు ఫిర్యాదు చేసి సరిపెట్టుకుంటున్నారు. వివరాల మేరకు.. గ్రామాల్లోని చెరువుల్లో చేపలు పట్టుకునే హక్కులను బహిరంగ వేలం పాటల ద్వారా ఏడాది గడువుతో పొందుతారు. దీని ద్వారా వచ్చే ఆదాయంతో పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పిస్తారు. కానీ నెల్లూరురూరల్లో ఇందుకు భిన్నంగా చెరువుల్లో చేపల పట్టుకునే హక్కులను పొంది చేపలను అమ్ముకుని లాభపడుతున్న హక్కుదారులు పంచాయతీలకు రూపాయి కూడా జమ చేయడంతో లేదు. ఇలా కొత్తవెల్లంటి పంచాయతీకి ఏకంగా రూ.29లక్షలు, పాత వెల్లంటికి రూ.10 లక్షలు వరకు జమకావాల్సి ఉంది. తాజాగా ఈనెల 18న గొల్లకందుకూరు పంచాయతీలో వేలం పాటలు నిర్వహించిన అధికారులు 50 శాతం నగదును కూడా జమ చేయించకపోవడం గమనర్హం. 2019వ సంవత్సరం కొత్తవెల్లంటిలో చెరువుల్లోని చేపలు పట్టుకునేందుకు గ్రామానికి చెందిన మారంరెడ్డి మస్తాన్‌రెడ్డి రూ.21.95 లక్షలకు హక్కులు పొందారు. కానీ ఇప్పటి వరకు ఆ మొత్తాన్ని గ్రామ పంచాయతీ ఖాతకు జమచేయలేదు. దీనిపై ఫిర్యాదు అందుకు కలెక్టర్ అతనిపై కేసు నమోదు చేయాలని ఎంపీడీవోను ఆదేశించడంతో ఆగస్టులో ఎంపీడీవో ఇచ్చిన ఫిర్యాదుతో రూరల్ పోలీసులు 420, 406 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అదే సమయంలో మరో వ్యక్తి రూ.8లక్షలకు మరోక చెరువుపై హక్కులు పొంది ఇప్పటి వరకు రూపాయి కూడా పంచాయతీ ఖాతాకి జమ చేయలేదు. పాత వెల్లంటిలోనూ చెరువుల్లో చేపలు పట్టుకునే హక్కును బహిరంగ వేలం ద్వారా పొందిన మరొక వ్యక్తి రూ.10 లక్షలకు సొంతం చేసుకుని నాలుగేళ్లు పూర్తవుతున్నా పంచాయతీకి జమ చేయకపోవడం గమనర్హం. ఈనెల 18వ తేదీన గొల్లకందుకూరులో పెద్ద, చిన్న చెరువులో చేపలను పట్టుకునేందుకు హక్కులు పొందిన ఇద్దరు వ్యక్తులు రూ.18.47 లక్షలకు వేలం పాడి అందులో 50 శాతం నగదును వెంటనే పంచాయతీకి చెల్లించాల్సి ఉండగా ఇప్పటికీ చెల్లించకపోవడం విశేషం.

● పంచాయతీలకు ఆర్థిక కష్టాలు

గ్రామ పంచాయతీల్లో చెరువుల్లోని మత్స్య సంపద ద్వారా రావాల్సిన ఆదాయం రాకపోవడంతో అభివృద్ధి పనులు చేయలేక సర్పంచు, కార్యదర్శులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తవెల్లంటికి రూ.29 లక్షలు, పాతవెల్లంటికి రూ.10 లక్షలు, గొల్లకందుకూరుకు రూ.9 లక్షలు జమ కాకపోవడంతో కనీసం వీధిలైట్లు, కాలువల్లో పూడికతీత, ఇతర పనులు నిర్వహించలేని దుస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. బహిరంగ వేలం పాటలు నిర్వహించే సమయంలో పంచాయతీ కార్యదర్శులు ఉదాసీనంగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైన జిల్లా అధికారులు స్పందించి చెరువుల్లోని మత్స్య సంపద ద్వారా వచ్చే ఆదాయాలను పంచాయతీలకు జమ చేయించాలని గ్రామీణులు కోరుతున్నారు.

దేవిస్‌పేటలో 'జగనన్న సురక్ష'

ఇందుకూరుపేట, జనవరి 2 : మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ దేవిస్‌పేటలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మేనాటి ప్రభావతమ్మ ప్రారంభించారు. డిస్ట్రిక్ ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎం.రమేష్ సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో నాగేంద్ర, తహసీల్దారు సుబ్బయ్య, మండల విస్తరణ అధికారి వసుంధరదేవి, మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ సి.కిషోర్‌కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు పర్యవేక్షించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు డాక్టర్ భార్గవి, డాక్టర్ తస్లీమ్, హెచ్ఈవో శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్స్ రమా, సతీష్‌బాబు పాల్గొన్నారు.

ట్యాబ్‌లపై అవగాహన



ట్యాబ్‌పై శిక్షణ ఇస్తున్న గైడ్

మనుబోలు, జనవరి 2: ఇటీవల ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసింది. మండలంలో 315మంది 8వ తరగతి విద్యార్థులు ఉండగా అందరికీ ట్యాబ్‌లు అందించారు. కొత్త కంపెనీ ట్యాబ్‌లు కావడంతో వాటిపై అవగాహన కల్పించేందుకు మంగళవారం కంపెనీ ప్రతినిధులు రత్నకుమార్,అల్తాఫ్, ఉదయ్‌లతోపాటు కసుమూరు ఉపాధ్యాయుడు హరికృష్ణ గైడ్‌గా వచ్చారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలల నుంచి ఇద్దరేసి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఇద్దరేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పింఛన్ ఇప్పించండయ్యా !

● ప్రభుత్వ కార్యాలయాల వద్ద వృద్ధురాలి ఆవేదన

మనుబోలు, జనవరి 2: మనుబోలుకు చెందిన అన్నాబుజ్జమ్మ తనకు రేషన్, పింఛన్ ఇప్పించాలంటూ మంగళవారం ప్రభుత్వ కార్యాలయాల వద్ద వాపోయింది. కనపడిన వాళ్లందరినీ వేడుకుంది. బుజ్జమ్మ ఊర్లు తిరుగుతూ యాచిస్తూ బతుకు తుం టుంది. ఇటీవల కాలు విరగడంతో మనుబోలులోని తూ ర్పు గిరిజన కాలనీలో ఉంటోంది. బుజ్జమ్మ పరిస్థితిని విన్న వారు ఆర్థికసాయం అందించారు. మనుబోలు వీఆర్ వో నాగార్జున రెడ్డి స్పందించి ఆమెకు ఆధార్ కార్డు లేకనే పథకాలు రావడం లేదని, దగ్గరుండి ఆమెకు ఆధార్‌కార్డు తీయించాలని వలంటీర్ ఆషిక్‌కు సూచించారు.

ఆటపాటలతో అంగన్‌వాడీల నిరసన



ఆటపాటలతో అంగన్‌వాడీ కార్యకర్తలు

కోవూరు, జనవరి 2: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె మంగళవారం 22వ రోజు ఆటాపాటలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు గండవరపు విజయకుమార్ మాట్లాడుతూ న్యాయమైన కోర్కెల సాధనకు అంగన్వాడీలు ఆందోళన చేస్తున్నారన్నారు. ఈ దీక్షాశిబిరాన్ని సీపీఎం నాయకులు గండవరపు శేషయ్య, మారుబోయిన సుబ్బారావు, అఫ్రోజ్ సందర్శించి మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సంఘం నాయకురాళ్లు వై సుజాత, వై సుభాషిణి, కవిత, ఎల్వీ శేషమ్మ, అనిత నాయకత్వం వహించారు.

గల్లంతైన 30 టీఎంసీలకు లెక్కలు తేల్చాలి

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న సోమిరెడ్డి

ముత్తుకూరు, జనవరి 2: జిల్లాలో రెండో పంటను సాకుగా చూపుతూ 30 టీఎంసీల నీటిని గల్లంతు చేశారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని డమ్మాయి పాలెం పంచాయతీలో మంగళవారం బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రులు కాకాణి, అంబటి వృథా అయిన నీటి వివరాలు తెలపాలని డిమాండ్ చేశారు. పేదలైన తుఫాను బాధితులందరికీ రూ.6వేలు, 40 కేజీల బియ్యం అందించాలన్నారు. లేనిపక్షంలో తన చేతగాని తనాన్ని ఒప్పుకుంటూ బీసీ, ఎస్సీలకు కాకాణి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. డమ్మా యిపాలెంలో 33 మందికి మత్స్యకా రేతర ప్యాకేజీ ఇవ్వకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. గ్రామంలో ప్రతి ఇంటికి కరపత్రాలు అందజేస్తూ, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొమ్మి సురేంద్ర, పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నీలం మల్లికార్జునయాదవ్, ఈపూరు మునిరెడ్డి, పల్లంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నర్సారెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బద్దెవోలులో ఆరోగ్య సురక్ష

మనుబోలు, జనవరి 2: మండలంలోని బద్దెవోలు సచివాలయ పరిధిలో మంగళవారం ఆరోగ్య సురక్ష కార్యక్ర మాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జీవీఎస్‌వీ ప్రసాద్, వైద్యురాలు గేయపూజిత, కార్యదర్శి ప్రసాద్, సర్పంచు ఉగ్గు మూడి శశికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



ట్రోఫీని అందజేస్తున్న వీసీ సుందరవల్లి

వెంకటాచలం, జనవరి 2 : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో రెండు రోజులుగా నిర్వహించిన నెల్లూరు జోన్ అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. నెల్లూరుకు చెందిన కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల విజేతగా నిలవగా, వర్సిటీ కళాశాల రన్నర్‌గా నిలిచింది. వీసీ సుందరవల్లి విజేతలకు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్‌కుమార్ బాబు, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ కే సునీత, టోర్నమెంట్ పరిశీలకుడు డాక్టర్ పీ ప్రసాద్‌రెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శి డాక్టర్ ఏ ప్రవీన్‌కుమార్, వై రవీంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏ రాష్ట్రంలో లేనివిధంగా రూ.3వేల పింఛన్

పొదలకూరు, జనవరి 2: ఏ రాష్ట్రంలో లేని విధంగా రూ.3 వేల సామాజిక పింఛన్‌ను అందించిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేపల్లి నియోజక వర్గంలోనే 40,732 మంది లబ్ధిదారులకు రూ.12.25కోట్లను పింఛన్‌గా అందచేస్తున్నట్లు చెప్పారు. ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఎంపీడీవో నగేష్ కుమారి, తహసీల్దారు వీరవసంతకుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● బస్సు యాత్రను జయప్రదం చేయండి

ముత్తుకూరు : సామాజిక సాధికారిత బస్సు యాత్రను జయప్రదం చేయాలని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ముత్తుకూరు వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ముత్తుకూరు బస్టాండ్ సెంటర్‌లో 6వతేదీ సాయంత్రం సాధికారత సదస్సు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, బాబిరెడ్డి చిన్నపరెడ్డి, తేజరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'చెన్ను' అనుచరులకు ఏ లోటూ రానివ్వను

● మెట్టుకూరు ధనుంజయరెడ్డి

రాపూరు(డక్కిలి), జనవరి 2: రాపూరులో దివంగత నేత చెన్ను బాలకృష్ణారెడ్డి అనుచరులకు ఏ లోటూ రానివ్వనని ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన క్యాలెండరును ఆయన ఆవిష్కరించారు. అనంతరం తానంచర్లలోని చెన్ను గార్డెన్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చెన్ను అనుచరులను ఇబ్బంది పెడుతున్నారని, ఎంతకాలం ఇబ్బంది పెడతారో తానూ చూస్తానన్నారు. సమావేశంలో ఎంపీపీ ప్రసన్న, నాయకులు చెన్ను తిరుపాలురెడ్డి, వెంకటరమణారెడ్డి, చెన్ను భాస్కరరెడ్డి, వెంకటస్వామితో పాటు పలువురు సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ చెవిలో చెప్పాడా..?

● ఎమ్మెల్యే అనిల్‌కు మాజీ మంత్రి నారాయణ కౌంటర్



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న నారాయణ

నెల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు సిటీలో పోటీ రాకుండా ఉండేందుకు జనసేన నేతలకు తాను డబ్బులు ఇచ్చినట్లు నగర ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతున్నారని, అయనకేమైనా ఈ విషయాన్ని పవన్‌కల్యాణ్ చెవిలో చెప్పాడా.. లేక కలలోకి వచ్చి చెప్పాడా..? అంటూ మాజీ మంత్రి పొంగూరు నారాయణ ఎద్దేవా చేశారు. మంగళవారం నగరంలోని 51వ డివిజన్ కపాడిపాలెంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నారాయణ ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. టికెట్ల విషయాన్ని తమ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చూసుకుంటారని చెప్పారు. నియంతృత్వ పాలన సాగిస్తున్న వైసీపీకి ఇక మిగిలింది మూడు నెలలేనని నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ కరిముల్లా, ప్రశాంత్, ప్రదీప్, వాసు, అరవ కిషోర్ తదితరులు పాల్గొన్నారు. కాగా మంగళవారం ఉదయం నారాయణ తన క్యాంపు కార్యాలయంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమ నిర్వహణ, ఓటర్ వెరిఫికేషన్‌పై పలు డివిజన్ల నేతలతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కూడా పాల్గొన్నారు.

రెండు నెలల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వం : కోటంరెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మరో రెండు నెలల్లో రాష్ట్రంలో టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటు కానుందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. 12వ డివిజన్ లోని చింతారెడ్డిపాలెం, రాజుపాలెం, వడ్డిపాలెం ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున యువకులు మంగళవారం టీడీపీలో చేరారు. వారికి నగరంలోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో శ్రీధర్‌రెడ్డితోపాటు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూరల్‌లో పెద్ద ఎత్తున యువత, మహిళలు, రైతులు టీడీపీలో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. రాష్ట్రంలో టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటు కావాలని ప్రజలంతా ఆకాంక్షిస్తు న్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు నందిపాటి శ్యామ్, దానా మహేష్, తుమ్మా తనూజ, ఏసయ్య, మాలకి, నాని తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం స్వర్ణకారుల క్యాలెండరు ఆవిష్కరణ

నెల్లూరు(హరనాథపురం): ముస్లిం స్వర్ణకార సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మంగళవారం ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి కార్యాలయంలో ఆవిష్కరించారు. ముస్లిం స్వర్ణకార సంఘం నాయకులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎన్‌డీసీసీబీ సీఈవో

నెల్లూరు(హరనాథపురం), జనవరి 2 : ఎన్‌డీసీసీబీ సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ శ్రీనివాసరావు మంగళవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కనిగిరి రిజర్వాయర్‌లో పూడిక తీయండి

నెల్లూరు(క్రైం), జనవరి 2: కనిగిరి రిజర్వాయర్‌లో పూడికతీస్తే 2.5 టీఎంసీల నీటిని అదనంగా వినియోగంలోకి తీసుకురావచ్చని త్వరితగతిన పూడిక తీయాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం జలవనరుల శాఖ పరిపాలనాధికారి కృష్ణయ్యకు ఆయన కార్యాలంలయంలో వినతి పత్రం ఇచ్చారు. కనిగిరి రిజర్వాయర్ నిర్మించి 140 ఏళ్లు కావడంతో పూడికతో నిండిపోయిందన్నారు. ఆరు టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.5 టీఎంసీల నీరే నిల్వ ఉంటోందని, పూడిక తీయించి పూర్తిసామర్థ్యం మేరకు నీరు నిల్వ చేయాలని విజ్ఞప్తి చేశారు.

నెల్లూరు రూరల్ ఇన్‌స్పెక్టర్‌గా సుబ్బారావు

నెల్లూరు(క్రైం): నెల్లూరు రూరల్ ఇన్‌స్పెక్టర్‌గా గుడ్లూరు సీఐగా విధులు నిర్వహిస్తున్న సుబ్బారావు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు రూరల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న పీ శ్రీనివాసులు రెడ్డిని గుంటూరు రేంజ్ వీఆర్‌కు బదిలీ చేస్తూ డీఐజీ పాలరాజు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

రాజరాజేశ్వరి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ప్రారంభం



ప్రతిష్ఠాపన మహోత్సవ పూజల్లో ఉభయకర్తలు

నెల్లూరు (సాంస్కృతికం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో నూతన పంచ లోహ విగ్రహ చర ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గోపూజ, తీర్థ సంగ్రహణం, గణపతి పూజ, పుణ్యాహవచనం, ప్రాయశ్చిత్తం, మాతృకా పూజ, దీక్షాధారణ, పంచగవ్య ప్రాసన, అఖండల స్థాపన, మండపారాధన, మూల మంత్ర జపం, జలాధివాసం జరిగాయి. సాయంత్రం ప్రదోషకాల పూజలు, అగ్నిస్థాపన, దీక్షా హోమం, మూలమంత్ర హోమాలు, అవాహిత హోమాలు, మహాస్నపనం, ధాన్యాధివాసం, శయ్యాధి వాసం, తీర్థ ప్రసాద వినియోగం జరిగాయి. ఈ కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకుడు రఘు రామశర్మ, వేద పండితులు రామకృష్ణశర్మ, రవిశర్మ ఆధ్వర్యంలో జరిగాయి. ఉభయకర్తలు గ్రోసు సుబ్బారావు, సత్యలక్ష్మి, ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, ధర్మకర్తలు, సహాయ కమిషనర్ ఏవీ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

డిపాజిట్లపై అత్యధిక వడ్డీ

● ఏపీజీబీ ఆర్ఎం మోహన్‌రెడ్డి



నెల్లూరు(హరనాథపురం), జనవరి 2 : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు(ఏపీజీబీ)లో అన్ని బ్యాంకుల కంటే అధిక వడ్డీనిచ్చే డిపాజిట్ పథకాలు ప్రవేశపెట్టామని ఆ బ్యాంకు రీజినల్ మేనేజర్ టీ మోహన్‌రెడ్డి చెప్పారు. మంగళవారం నగరంలోని ఏపీజీబీ కార్యాలయంలోతి ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని డిపాజిట్లపై త్రైమాసిక వడ్డీ అందచేస్తున్నామన్నారు. ప్రగతి కుబేర్ పేరుతో నూతన సంవత్సరంలో నూతన డిపాజిట్ పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఈ పథకంలో 444 రోజులకు 8.3 శాతం వడ్డీ లభిస్తుందని చెప్పారు. మహిళా సూపర్ సీనియర్ సిటిజన్లకు డిపాజిట్లపై 8.30శాతం వడ్డీ, ఒక సంవత్సరంపైన మూడేళ్లలోపు డిపాజిట్లకు 7.90 శాతం వడ్డీ అందచేస్తున్నామన్నారు. సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.25శాతం వడ్డీ ఇస్తున్నామన్నారు. సాధారణ వ్యక్తులకు డిపాజిట్లపై 7.50 శాతం వడ్డీ, సాధారణ మహిళా డిపాజిటర్లకు 7.55 శాతం వడ్డీ అందచేస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్లకు టర్మ్ డిపాజిట్లపై ఒక ఆర్థిక సంవత్సరానికి వచ్చే వడ్డీలో రూ.50వేల వరకు ఎటువంటి పన్ను విధింపు లేదన్నారు. 2023 డిసెంబరు 31 నాటికి రూ.5941.06కోట్ల వ్యాపార స్థాయిని తమ బ్యాంకు సాధించిందని తెలిపారు. ఇంటి నుంచే మొబైల్ యాప్ ద్వారా సేవింగ్స్ ఖాతాను తెరిచే సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో చీఫ్ మేనేజర్ సీ ఆంజనేయులు, సీనియర్ మేనేజర్లు ఎన్ శ్రీకాంత్‌నెహ్రూ, కే అజయ్‌సింహారెడ్డి, రీజినల్ కార్యాలయం అధికారులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని కూల్చేయండి

● నోటీసు అంటించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు(సిటీ), జనవరి 2 : నగరంలోని 6వ డివిజన్ పప్పులవీధిలో కార్పొరేషన్ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని వెంటనే కూల్చేయాలని సిటీ ప్లానింగ్ అధికారులు ఆదేశించారు. ఈ మేరకు ఆ నిర్మాణానికి నోటీసు అంటించారు. స్థానిక వాటర్ ట్యాంకు సమీపాన మున్సిపల్ పార్కు, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సుకు చెందిన స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మాణం చేపట్టడంపై ఇటీవల ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన సిటీ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణం కూల్చివేతకు నోటీసులిచ్చారు. వెంటనే కూల్చకపోతే తామే కూల్చేస్తామని హెచ్చరించారు.

చంద్రబాబును సీఎం చేయండి

నెల్లూరు రూరల్, జనవరి 2 : రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటేసి చంద్రబాబును సీఎం చేయాలని రూరల్ ఎమ్మెల్యే సతీమణి కోటంరెడ్డి సుజిత ప్రజలను కోరారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం 1వ డివిజన్ నారాయణరెడ్డిపేటలో ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరు చైతన్యవంతులై సార్వత్రిక ఎన్నికల్లో ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఆమెతోపాటు కుమార్తెలు లక్ష్మీ హైందవి, సాయి వైష్ణవి కూడా ప్రచారంలో పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయండి

నెల్లూరు(హరనాథపురం), జనవరి 2 : జిల్లాలో బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీని వెంటనే చేపట్టాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంద బాబ్జి, కార్యదర్శి విడవలూరు శ్రీకాంత్ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ హరినారాయణ్‌కు వినతిపత్రం ఇచ్చారు. పదోన్నతుల్లో రిజర్వేషన్ పాటించాలని, దళిత ఉద్యోగులపై వేధింపులు అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారులతో చర్చించి సర్క్యులర్ జారీ చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని చెప్పారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200

ఆరు ప్రమాదాల్లో 8మంది మృత్యువాత

విద్యుదాఘాతంతో ఇద్దరు

చిల్లకూరు, జనవరి 2:చిల్లకూరు మండలం చింతవరం గ్రామంలో మంగళవారం విద్యుదాఘాతంతో ఇద్దరు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వీరేంద్రకుమార్(24), ముఖేష్‌కుమార్ టిప్పర్ డ్రైవర్లుగా, మనీష్‌కుమార్(23) క్లీనర్‌గా చింతవరంలో పనిచేస్తున్నారు. మంగళవారం చింతవరం సమీపంలోని వేబ్రిడ్జి వద్ద టిప్పర్‌కు గ్రీస్ పెడుతున్నారు. ఈ క్రమంలో ముఖేష్‌కుమార్ టిప్పర్ హైడ్రాలిక్ లిఫ్టును పైకి లేపుతుండగా ట్రక్కు 11కేవీ విద్యుత్ తీగలకు తగడంతో గ్రీస్ పెడుతున్న వీరేంద్రకుమార్, మనీష్‌కుమార్ విద్యుతాఘాతానికి లోనై మృతిచెందారు. ముఖేష్‌కుమార్‌కు గాయాలయ్యాయి. అతడిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటనాస్థలాన్ని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, ఎస్ఐ అంజిరెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



1. వీరేంద్రకుమార్(ఫైల్‌ఫొటో)
2. మనీష్‌కుమార్(ఫైల్‌ఫొటో)



సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, ఎస్ఐ అంజిరెడ్డి

టీ దుకాణంపైకి దూసుకెళ్లిన ఇన్నోవా

- ఇద్దరి మృతి
- ముగ్గురికి గాయాలు



హరి,మురళీనాయుడు (ఫైల్‌ఫొటోలు)

ఏర్పేడు, జనవరి 2: టీ దుకాణంపై కారు దూసుకెళ్లిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ముగ్గురికి గాయాలైన ఘటన ఏర్పేడు మండలంలో చోటుచేసుకుంది.ఎస్ఐ జిలానీ కథనం మేరకు... తిరుపతికి చెందిన సుధాకర్ తన స్నేహితుడితో కలిసి ఇన్నోవా వాహనంలో వెంకటగిరికి మంగళవారం ఉదయం వెళ్లాడు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో ఏర్పేడు మండలం చింతలపాళెం అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద అతివేగంతో ఇన్నోవా అదుపు తప్పింది. ఎదురుగా ఉన్న టీ దుకాణం ముందున్న వేపచెట్టును ఢీకొని అనంతరం అక్కడ టీ తాగుతున్న వ్యక్తులపైకి దూసుకెళ్లింది.ఈ ప్రమాదంలో టీ తాగడానికి వచ్చిన చింతలపాళెం గ్రామానికి చెందిన మురళీనాయుడు(50) అక్కడికక్కడే మృతి చెందగా చింతలపాళెం దళితవాడకు చెందిన హరి(57) తీవ్రంగా గాయపడ్డాడు.తిరుపతికి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.అక్కడే టీ తాగుతున్న బీట్ ఆఫీసర్ హైమావతి తీవ్రంగా గాయపడగా ఇన్నోవా డ్రైవర్ సుధాకర్,అతడి స్నేహితుడు కూడా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో రుయాస్పత్రికి తరలించారు. మురళీ నాయుడు, మణి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు

తడ, జనవరి 2 : బైక్ అదుపుతప్పడంతో జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. సూళ్లూరుపేట పట్టణం వట్రపాళెం గ్రామానికి చెందిన తమిళ సెల్వం (28) సోమవారం సాయంత్రం తన స్నేహితుడి బైక్‌పై రామాపురం వచ్చాడు. అక్కడ పనిచూసుకొని అర్ధరాత్రి తిరుగుప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలోని రామాపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి దాటిన తరువాత బైక్ అదుపుతప్పడంతో కిందపడిపోయి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందడంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డు దాటుతూ ఒకరు



జగన్నాథరెడ్డి (ఫైల్ ఫొటో)

చంద్రగిరి, జనవరి 2:చంద్రగిరి- తొండవాడ మార్గ మధ్యంలో రోడ్డు దాటుతున్న వ్యక్తిని టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే చనిపోయాడు. పోలీసుల కథనం మేరకు... చంద్రగిరి మండలంలోని కొత్తశానంబట్లలో సోమవారం జల్లికట్టు జరిగింది. జల్లికట్టు ప్రశాంతంగా జరిగిన నేపథ్యంలో మంగళవారం గ్రామస్తులు కొంత మంది తొండవాడ సమీపంలోని డాబాకు వచ్చి భోంచేశారు. తిరిగి ఇంటికి వెళ్లడానికి సర్వీసు రోడ్డు దాటుతుండగా వారిలో ఒకరైన జగన్నాథరెడ్డి(52)ని తిరుపతి వైపు వెళ్ళే టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొంది.ఈ ప్రమాదంలో జగన్నాథరెడ్డి మృతదేహం రెండు ముక్కలుగా విడిపోయింది.పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సర్వీసు రోడ్డు కాలువలో నాగరాజు మృతదేహం

టూవీలర్ ప్రమాదంలో ఒకరు

చంద్రగిరి, జనవరి 2: చంద్రగిరి మండల పరిధిలోని సి.మల్లవరం జంక్షన్ సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం హరిజనవాడకు చెందిన నాగరాజు(60) ఎస్ఐసీలో ఏజెంటు. సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై తొండవాడకు వచ్చాడు. రాత్రి ఇంటికి రాలేదు. మంగళవారం ఉదయం సి.మల్లవరం సమీపంలోని సర్వీసు రోడ్డు కాలువలో తీవ్ర గాయాలతో మృతి చెందినట్లు గ్రామస్తులు గుర్తించారు.పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.నాగరాజును వాహనం ఢీకొందా, లేక ద్విచక్ర వాహనం అదుపు తప్పి కాలువలో పడి చనిపోయాడా అనేది విచారణలో తెలియాల్సి ఉంది.

గుడికి వెళ్లొస్తూ మహిళ

నారాయణవనం, జనవరి 2:నారాయణవనంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... కీళగరం గ్రామానికి చెందిన శకుంతల(51) సోమవారం రాత్రి స్థానికంగా ఉన్న ఆలయ దర్శనం చేసుకుని ఇంటికి బయల్దేరింది.వడమాలపేట మండలం కాయంపేటకు చెందిన మునస్వామి మోటార్ సైకిల్‌పై వస్తూ ఎదురుగా వస్తున్న శకుంతలను కళింమిట్ట క్రాస్ వద్ద ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శకుంతల తలకు తీవ్ర గాయాలైంది. స్థానికులు గుర్తించి పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి... అక్కడినుంచి మెరుగైన చికిత్సకోసం తిరుపతి రుయాకు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ వైపు ఇద్దరు సిటింగుల చూపు!



- అవమానించిన అధినేతకు తగిన బుద్ధి చెప్పేందుకు రగిలిపోతున్న వైనం

తిరుపతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు సిటింగు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారు. అధికార పార్టీలో తమకు జరుగుతున్న అవమానానికి రగిలిపోతున్న ఆ ఇద్దరూ ప్రతీకారం తీర్చుకునేలా అధినేతకు తగిన బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. దీంతో కాంగ్రెస్ దిశగా పయనించేందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటూ సమాయత్తమవుతున్నట్టు వారి సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. అదే జరిగితే ఉమ్మడి జిల్లాలో ప్రాభవం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీకి తిరిగి ప్రాణం పోయడంలో వీరిదే తొలి అడుగు కానుంది.

జిల్లాలో చెరో దిశగా వున్న రెండు నియోజకవర్గాల సిటింగ్ ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో తిరిగి టికెట్ ఇవ్వడం లేదని అధినేత జగన్ స్పష్టత ఇచ్చేసినట్టు ఆయా నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. తూర్పు దిశగా వున్న నియోజకవర్గ ఎమ్మెల్యే అధికార పార్టీలో ఆవిర్భావం నుంచీ వున్నారు. ఒకసారి ఓటమి చెందినా ఓపిగ్గా పార్టీలో కొనసాగారు. నిత్యం ప్రజల్లో వుంటూ రెండవ పర్యాయం కిందటి ఎన్నికల్లో గెలుపొందారు. స్వతహాగా సౌమ్యుడని పేరుంది. కుటుంబసభ్యులొకరి తీరుతో పలువురు పార్టీ నాయకులు నొచ్చుకున్న మాట వాస్తవం. దానిపై ఫిర్యాదులు రావడంతో ఆ కుటుంబ సభ్యుల జోక్యం దాదాపుగా తగ్గించేశారు. ఏవో గ్రామస్థాయి నిర్ణయాలు, అభివృద్ధి పనుల్లో మినహా ఆయన నిర్ణయాలేవీ చెల్లుబాటు కాలేదు. జిల్లాపై పెత్తనం చెలాయిస్తున్న ఓ మంత్రి నిర్ణయించిన మేరకే పదవులు సహా అధికారుల బదిలీలు వంటివి జరిగాయి. అయినా ఎన్నికలు సమీపించేసరికి సర్వేల్లో రిపోర్టులు బాగా రాలేదని, పార్టీ నాయకుల్లో వ్యతిరేకత వుందన్న కారణాలు చూపి టికెట్ తిరస్కరించినట్టు ప్రచారం జరుగుతోంది. ఇక ఉమ్మడి జిల్లా కేంద్రానికి చేరువగా వున్న నియోజకవర్గ సిట్టింగ్ ఎమ్మెల్యేది మరో దీన గాథ. ఆయన కూడా పార్టీలో ఆవిర్భావం నుంచీ వున్నారు. జడ్పీటీసీగా పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత గత సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ దక్కింది.పారిశ్రామికవేత్త నేపథ్యం వుండడంతో సొంత ఆర్థిక వనరులు ఖర్చు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేశారు. పోలింగ్ రోజు టీడీపీ కంచుకోట వంటి ఓ గ్రామంలో పోలింగ్ కేంద్రానికి వెళ్ళి ఏకపక్ష ఓటింగ్ జరుగుతోందంటూ గొడవ చేశారు. ఆ క్రమంలో బ్యాలెట్ బాక్సులో నీరు పోసేశారు. దీంతో కోపోద్రిక్తులైన గ్రామస్తులు దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఆరోగ్యం విషమించిన పరిస్థితుల్లో రోజుల తరబడీ ఆస్పత్రి పాలై నెమ్మదిగా కోలుకున్నారు. ఎమ్మెల్యేగా గెలిచాక కూడా జిల్లాలో ఆధిపత్యం వహిస్తున్న ఓ మంత్రి ఇష్టాఇష్టాలకు అనుగుణంగానే వ్యవహరిస్తూ వస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా పార్టీ నిధులపై ఆధారపడకుండా సొంత నిధులు వెచ్చించేందుకు సంసిద్ధమయ్యారు. అయినా ఏవో కారణాలు చూపి అధినేత టికెట్ నిరాకరించినట్టు విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ ఎమ్మెల్యేకి పరిశ్రమలు, వ్యాపారాలపరంగా బెంగుళూరుతో సంబంధాలున్నాయి. అందులో భాగంగా అక్కడి రాజకీయ పార్టీల ముఖ్యనేతలతో సన్నిహిత పరిచయాలు పెంచుకున్నారు. ఇటీవల వచ్చిన పర్వదినాన కర్ణాటకలో కీలక పదవిలో వున్న కాంగ్రెస్ ముఖ్యనేత కుటుంబీకులను తిరుమలకు దర్శనానికి వెంట తీసుకెళ్ళినట్టు సమాచారం. టికెట్ విషయంలో అధినేత వ్యవహారశైలితో తీవ్ర అవమానానికి, మానసిక వేదనకు గురవుతున్నందున అధినేతకు కూడా అదేవిధమైన గుణపాఠం చెప్పాలని కర్ణాటక నేత ద్వారా కాంగ్రెస్‌లో చేరేందుకు సంసిద్ధమవుతున్నట్టు సమాచారం. తొలుత ప్రస్తావించిన సిటింగ్ కూడా ఇదే తీరులో ఆలోచిస్తూ కాంగ్రెస్‌కు చేరువయ్యేందుకు నిర్ణయించుకున్నట్టు తెలిసింది. వీరిని అధిష్ఠానం బుజ్జగించకపోయినా, లేక టికెట్లు ఖరారు చేయకపోయినా ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచీ కాంగ్రెస్‌లో చేరబోయే తొలి నేతలు వీరే కావడానికి అవకాశాలున్నాయి.

ఆ ఇద్దరికీ లైన్‌క్లియర్



- తిరుపతి, చంద్రగిరి వైసీపీ సమన్వయకర్తలుగా అభినయ్, మోహిత్
- మిగిలిన సెగ్మెంట్లలో మార్పుచేర్పులకు అవకాశం? -పార్టీ ప్రకటనతో ఇతర సెగ్మెంట్ల నేతల గుండెల్లో రైళ్ళు

తిరుపతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు వైసీపీ అధిష్ఠానం సమన్వయకర్తలను ప్రకటించింది. మంగళవారం రాత్రి విడుదల చేసిన జాబితాలో తిరుపతికి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిని, చంద్రగిరికి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని సమన్వయకర్తలుగా పేర్కొంది. కాకపోతే ఇదేమీ కొత్త విషయం కాకపోవడంతో అధికార పార్టీ ప్రకటన జిల్లాలో పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. అయితే అదే సమయంలో నగరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట, గూడూరు ఎమ్మెల్యేల అనుచరవర్గాల్లో దడ మొదలైంది. తొలి జాబితాలో కేవలం తిరుపతి, చంద్రగిరి మాత్రమే చోటుచేసుకోవడంతో మిగిలిన చోట్ల మార్పుచేర్పులు తప్పవన్న సంకేతం వెలుడడంతో ఆయా నియోజకవర్గాల ముఖ్యనేతల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి.

తిరుపతి ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి 2019లో కొత్త మంత్రివర్గం ఏర్పాటైన వెంటనే తాను తదుపరి ఎన్నికల్లో పోటీ చేయబోవడం లేదని, ప్రత్యక్ష పోటీ రాజకీయాలకు దూరంగా వుంటానని ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచే రానున్న ఎన్నికల్లో ఆయన వారసుడిగా కుమారుడు అభినయ్‌రెడ్డి బరిలో వుంటారని పార్టీ వర్గాలతో పాటు సామాన్య జనం కూడా భావిస్తున్నారు. గతేడాది తిరుపతిలో వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలో కూడా అభినయ్‌రెడ్డిని గెలిపించాలని శ్రేణులను కోరారు. దీంతో తదుపరి ఎన్నికల్లో తిరుపతి నుంచీ వైసీపీ అభ్యర్థి అభినయ్‌రెడ్డి అన్నదాంట్లో ఎవరికీ ఎటువంటి అనుమానాలు లేకుండాపోయాయి. ఇక చంద్రగిరి వైసీపీ అభ్యర్థిత్వంపై మరింత స్పష్టత మొదటి నుంచే వుంది. గతేడాదిలోనే చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి స్థానంలో వచ్చే ఎన్నికలకు ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి అభ్యర్థిగా వుంటారని పార్టీ ప్రకటించింది. మోహిత్‌కు గన్‌మెన్ సదుపాయం కూడా కల్పించింది. అధికారిక ప్రోటోకాల్ కోసం భాస్కర్‌రెడ్డి తుడా ఛైర్మన్ పదవి నుంచీ తప్పుకోవడంతో ఆ స్థానంలో మోహిత్‌ను నియమించిన సంగతి తెలిసిందే. తిరుపతిలో విజయసాయిరెడ్డి సమీక్షా సమావేశం జరిపినపుడు ఇదే విషయాన్ని స్పష్టం చేయగా తర్వాత మోహిత్‌ను చంద్రగిరి వైసీపీ శ్రేణులకు పరిచయం చేసేందుకు భారీఎత్తున నిర్వహించిన ఆత్మీయ సదస్సులో కూడా డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ మిధున్ తదితర కీలక నేతలంతా మోహిత్ అభ్యర్థిత్వంపై స్పష్టత ఇచ్చి గెలిపించాలని శ్రేణులకు పిలుపు ఇచ్చిన సంగతి తెలియంది కాదు. దీంతో మంగళవారం పార్టీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ఈ రెండు నియోజకవర్గాల్లో గానీ, జిల్లావ్యాప్తంగా గానీ ఎలాంటి ఆశ్చర్యం, సంచలనం కలిగించలేదు. దీనిపై పెద్దగా చర్చ కూడా లేదు.అయితే మిగిలిన నియోజకవర్గాల ప్రస్తావన జాబితాలో లేకపోవడం జిల్లాలో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. సమన్వయకర్తలుగా ప్రకటించడమంటే ఆయా చోట్ల వారే రానున్న ఎన్నికల్లో అభ్యర్థులన్నది తెలిసిందే. దీంతో సత్యవేడు, సూళ్ళూరుపేట, గూడూరు వంటి రిజర్వుడు నియోజకవర్గాల్లో అభ్యర్థులను మారుస్తారంటూ జరుగుతున్న ప్రచారానికి జాబితా బలం చేకూరుస్తోంది. ఈ విషయం పక్కన పెడితే టికెట్ విషయంలో మార్పులుండవని, తమకు ఢోకా లేదని భావిస్తున్న నగరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేల విషయంలో కూడా పార్టీ పునరాలోచనలో వుందన్న సంకేతాలను తాజా జాబితా ఇచ్చింది. అలాగే ఉమ్మడి జిల్లా పరిధిలోని ఇతర నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కాకపోతే మార్పులుంటేనే కొత్తగా సమన్వయకర్తలను నియమిస్తారని, తమ నియోజకవర్గాల్లో మార్పులు లేవు కాబట్టి సమన్వయకర్తలను నియమించే ప్రసక్తి లేదని, అందువల్లే జాబితాలో ఆ ప్రస్తావన లేదని సిట్టింగులు తమ అనుచరవర్గాల ఎదుట బింకం ప్రదర్శిస్తున్నట్టు సమాచారం.

జనసేన నేత పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయండి


- కిరణ్ రాయల్ కేసులో పోలీసు శాఖను ఆదేశించిన హైకోర్టు
- తదుపరి విచారణ 9కి వాయిదా

తిరుపతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మంత్రి రోజాను విమర్శించారంటూ జనసేన తిరుపతి ఇంచార్జి కిరణ్ రాయల్‌పై కేసు నమోదు చేసిన నగరి పోలీసులు ఆయనకు సంబంధించిన మొబైల్ ఫోన్ల నుంచీ డేటా చౌర్యానికి పాల్పడ్డారంటూ దాఖలైన రిట్ పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం విచారణకు స్వీకరించింది. దీనిపై వారంలోగా కౌంటర్ దాఖలు చేయాలని హోంశాఖ జీపీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 9వ తేదీకి వాయిదా వేసింది. వివరాల్లోకి వెళితే ....తిరుపతి జనసేన ఇంచార్జి కిరణ్ రాయల్ 2022 అక్టోబరు 16న మీడియా సమావేశంలో మంత్రి రోజాపై విమర్శలు చేశారు. ఇవి అనుచిత విమర్శలంటూ నగరి, పుత్తూరుల్లో వైసీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేయడంతో ఆయనపై అదే నెల 18న కేసు నమోదైంది.నవంబరు 11న ఈ కేసులో నగరి పోలీసులు తిరుపతిలో కిరణ్ రాయల్‌ను ఆయన ఇంటిలో వుండగా అదుపులోకి తీసుకుని నగరికి తరలించి మరుసటి రోజు అక్కడి కోర్టులో హాజరుపరిచారు. కాగా కిరణ్ రాయల్‌ను అదుపులోకి తీసుకున్నపుడు ఆయనకు, ఆయన సతీమణికి చెందిన రెండు మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆయన పోలీసు కస్టడీ నుంచీ విడుదలయ్యాక నవంబరు 23న పోలీసుల స్వాధీనంలో వున్న తన మొబైల్ ఫోన్లను తిరిగి అప్పగించాల్సిందిగా కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై కోర్టు మొబైల్ ఫోన్ల నుంచీ ఎలాంటి సమాచారం ఇతరులకు లీక్ చేయకూడదంటూ పోలీసులను ఆదేశించింది. కిరణ్ రాయల్ హైకోర్టును ఆశ్రయించడంతో అతనిపై నమోదు చేసిన సెక్షన్ 294 మినహా మిగిలిన సెక్షన్లను కొట్టివేసింది. అదే సమయంలో సాక్ష్యాధారాల కింద తీసుకున్న అతని రెండు మొబైల్ ఫోన్ల నుంచీ మంత్రి రోజా గురించి మాట్లాడిన వీడియో మినహా మరే ఇతర సమాచారం సేకరించరాదని ఆదేశించింది. ఫోన్ల నుంచీ కేసుకు అవసరమైన డేటాను ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచీ మాత్రమే సేకరించాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు నగరి కోర్టు సంబంధిత మొబైళ్లను భద్రపరచాలని,దాని నుంచీ ఎవరూ ఎలాంటి సమాచారం సేకరించకుండా కట్టడి చేయాలని కోర్టులో సంబంధిత ప్రాపర్టీ క్లర్కును ఆదేశించింది. అయితే కోర్టు అనుమతి లేకుండా పోలీసులు మొబైల్ ఫోన్లను తీసుకెళ్ళినట్టు తేలడంతో కలకలం రేగింది.ఈ నేపథ్యంలో కిరణ్ రాయల్ తాజాగా హైకోర్టును ఆశ్రయించారు. తన ఫోన్ల నుంచీ పోలీసులు డేటా చౌర్యానికి పాల్పడ్డారని, అందులోని ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతామని బెదిరిస్తున్నారంటూ తన రిట్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రజా సమస్యలు లేవనెత్తుతున్న ప్రతిపక్ష నేతల ఫోన్ల నుంచీ డేటా దొంగలించడం గోప్యతా హక్కును హరించడమేనని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ఆయన హైకోర్టును కోరుతూ గత నెల 27వ తేదీన రిట్ పిటిషన్ దాఖలు చేయగా 29వ తేదీన పిటిషన్ రిజిస్టరై (రిట్ పిటిషన్ నంబరు 33578-2023) మంగళవారం విచారణకు వచ్చింది. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన జడ్జి జస్టిస్ భానుమతి వారంలోగా కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా హోంశాఖ జీపీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 9వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, నగరి డీఎస్పీ రవికుమార్, నగరి అర్బన్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్, మునుపటి నగరి సీఐ, ప్రస్తుత నింద్ర సీఐ శ్రీనివాసంతి, నగరి అర్బన్ పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ రాజశేఖర్‌లను కిరణ్ రాయల్ ప్రతివాదులుగా పేర్కొన్నారు. కాగా కిరణ్ రాయల్ తరఫున న్యాయవాది పి.వి.జి.ఉమేష్ చంద్ర కేసు వాదిస్తున్నారు.

గత ఏడాది ఆర్టీసీ ఆదాయం రూ.595కోట్లు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 2: గత ఏడాదిలో ఆర్టీసీకి జిల్లాలో రికార్డు స్థాయిలో రూ.595కోట్ల ఆదాయం లభించింది. ఇందులో తిరుపతి-తిరుమల మార్గం ద్వారానే దాదాపు రూ. 300కోట్లు రావడం విశేషం. జిల్లా పరిధిలో 11డిపోలుండగా సొంత, అద్దె కలిపి 947 బస్సులున్నాయి. ఇవి 1,219 లక్షల కిలోమీటర్లు తిరగ్గా, ఈపీకే రూ.50, ఆక్యుపెన్సీ రేషియో 69శాతం నమోదైంది. శాశ్వత, పొరుగుసేవల విభాగాల సిబ్బంది సమన్వయంతో వ్యవహరించడంతోనే ఆదాయంలో రాష్ట్రంలోనే మొదటి స్థానం కొనసాగుతున్నట్లు ఈడీ చెంగల్‌రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిబ్బందిని అభినందించారు.

అంగన్‌వాడీ వర్కర్ల వినూత్న నిరసన



చంద్రగిరిలో దున్నపోతుకు వినతిపత్రం

తిరుపతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన సమ్మె మంగళవారం 21వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు తమ సమస్యలు పరిష్కరించాలంటూ వినూత్న రీతిలో ప్రభుత్వానికి నిరసనలు తెలిపారు.తిరుపతి నగరం సహా చంద్రగిరి, పుత్తూరు, సత్యవేడు, నాయుడుపేట, సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి పట్టణాలు, కోట మండల కేంద్రంలో అంగన్‌వాడీ ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. తమ సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం దున్నపోతు చందంగా వ్యవహరిస్తోందన్న అర్థం వచ్చేలా తిరుపతి, చంద్రగిరి, గూడూరు, సూళ్ళూరుపేట, పుత్తూరు, సత్యవేడు తదితర పట్టణాల్లో ఉద్యోగులు దున్నపోతులకు, బర్రెలకు వినతి పత్రాలు అందజేసి నిరసన వ్యక్తం చేశారు. కాగా కోట మండల కేంద్రంలో ఉద్యోగులు పొర్లు దండాలు పెట్టి నిరసన తెలియజేయగా నాయుడుపేటలో సోది చెప్పి, వెంకటగిరిలో అంబేడ్కర్ చిత్ర పటానికి వినతులు అందజేసి ఉద్యోగులు తమ నిరసనను, అసంతృప్తిని వ్యక్తం చేశారు.

9న వెంకటగిరికి చంద్రబాబు రాక



సభకు స్థల పరిశీలన చేస్తున్న టీడీపీ నాయకులు

వెంకటగిరి, జనవరి 2: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 9వ తేదీ వెంకటగిరికి రానున్నారు. వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో చంద్రబాబు బహిరంగ సభ నిర్వహించనున్నారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పశ్చిమ రాయలసీమ శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, టీడీపీ నాయకులు నరసింహయాదవ్, కొండేపి గంగాప్రసాద్, పాశం సునీల్‌కుమార్, నెలవల సుబ్రహ్మణ్యం, హేమలత, జన్నిరమణయ్య, జనసేన నాయకులు గూడూరు వెంకటేశ్వర్లు తదితరులు బహిరంగ సభ, హెలిప్యాడ్ ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలించారు. పట్టణ పరిధిలోని విశ్వోదయ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణం, తిరుపతి - వెంకటగిరి రోడ్డు మార్గంలో ఉన్న మరో స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తన నివాసంలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్లమెంటు పరిధిలోని అన్ని ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనసమీకరణ చేయాలని సూచించారు.

సిలికా మైనింగ్‌కు అనుమతులివ్వొద్దు



నిరసన తెలుపుతున్న గిరిజనులు

చిల్లకూరు, జనవరి 2: మండలంలోని మోమిడి పంచాయతీ పరిధిలోని అటవీభూముల్లో సిలికా మైనింగ్ నిర్వహణకు అనుమతులు ఇవ్వొద్దని స్థానిక గిరిజనులు మంగళవారం గ్రామ సచివాలయం సమీపంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అటవీ భూముల్లోని జీడి మామిడి తోటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్నారు. అదేవిధంగా ఎండిన సరుగుడు పుల్లలతో వంట తయారు చేసుకుని బతుకుతున్నామన్నారు. ఆ భూముల్లో సిలికా మైనింగ్ నిర్వహించేందుకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని, తమకు జీవనాధారంగా ఉన్న భూముల్లో మైనింగ్ నిర్వహణకు అనుమతులు ఇవ్వరాదని అన్నారు. కార్యక్రమంలో మోమిడి పంచాయతీలోని గిరిజనులు పాల్గొన్నారు.

తిక్కవరంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గాయకులు రాజేష్, బాలకృష్ణ

చిల్లకూరు, జనవరి 2: మండలంలోని తిక్కవరం గ్రామంలో మంగళవారం జైభీమ్ సేవాసమితి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గాయకుడు రేంజర్ల రాజేష్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. అలాగే రాజ్యాంగంలో ఆయన పొందుపరచిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గాయకుడు బాలకృష్ణ, సర్పంచులు సతీష్‌రెడ్డి, త్రివిక్రమ్ భూపతి, రమేష్, వేణుగోపాల్, హరి, ఎన్వీ రమణ, వెంకటరమణయ్య, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

గూడూరు, జనవరి 2: స్థానిక బాలాజీనగర్‌లోని ప్రగతిసేవా సంస్థ కార్యాలయంలో రామ్మోహన్‌రావు దాతృత్వంతో మంగళవారం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, మయూరి శ్యామ్‌యాదవ్, సురేంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, ప్రభాకర్, రాము, శివకుమార్, వెంకటేశ్వర్లు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు

వెంకటగిరి టౌన్, జనవరి 2: మండల పరిధిలోని యాతలూరులో మంగళవారం ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వెంకటలక్ష్మి రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవో వెంకటేశ్వర్లు ఆరోగ్యకార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె వరకే చూసుకోండి....
చెత్త ట్రాక్టర్‌ను ఎలా అడ్డుకుంటారు?
పారిశుధ్య కార్మికులతో ఎమ్మెల్యే సంజీవయ్య వాగ్వాదం



పారిశుధ్య కార్మికులతో, సీఐటీయూ నేతలతో ఎమ్మెల్యే వాగ్వాదం

నాయుడుపేట టౌన్, జనవరి 2: సమ్మె చేసుకుంటున్నారు.. సమ్మె వరకే చూసుకోండి...అంతే కానీ చెత్త ట్రాక్టర్‌ను ఎలా అడ్డుకుంటారు... అంటూ సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పారిశుధ్య కార్మికులతో, సీఐటీయు నాయకులతో వాగ్వాదానికి దిగారు.నాయుడుపేటలో 8 రోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మె నిర్వహిస్తున్నారు. దీంతో పట్టణంలో చెత్త ఎక్కడికక్కడ నిల్వ చేరింది.దీంతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు వేరే కార్మికుల చేత చెత్తను ట్రాక్టర్ ద్వారా మంగళవారం తరలించే ప్రయత్నాలు చేపట్టారు.ఈ సమాచారం తెలుసుకున్న సమ్మెలో ఉన్న పారిశుధ్య కార్మికులు, వారి మద్దతుదారులైన సీఐటీయు నాయకులు అక్కడకు చేరుకొని చెత్త ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. అదే మార్గంలో వెళ్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య కారు దిగి ఏం జరుగుతోందంటూ ఆరా తీశారు. చెత్త ట్రాక్టర్‌ను మున్సిపల్ కార్మికులు అడ్డుకుంటున్నారని అధికారులు తెలిపారు. దీంతో చెత్త ట్రాక్టర్‌తో మీకేమిటి సంబంధం? మీ సమ్మె మీరు చేసుకోండంటూ పారిశుధ్య కార్మికులతో, సీఐటీయు నాయకులతో ఎమ్మెల్యే సంజీవయ్య వాగ్వాదానికి దిగారు. జగన్ పాదయాత్ర సమయంలో తాను అధికారం చేపట్టిన వెంటనే పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయడంతో పాటు సమాన పనికి సమానవేతనం ఇస్తానని వాగ్దానం ఇచ్చారు సార్... అయితే నాలుగున్నరేళ్లయినా తమకేం న్యాయం చేయలేదు కాబట్టే సమ్మె చేస్తున్నాం. చెత్తను వేరే కార్మికుల చేత తరలిస్తే ఒప్పుకోం.న్యాయం చేయండని కోరారు. చివరకు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పడంతో ఆందోళనకారులు వెనుదిరిగారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

పశువుల కాపరి మృతి

కోట, జనవరి 2: మండల పరిధిలోని చిట్టేడు చెరువులో గల్లంతైన నన్నిమాల సుబ్రహ్మణ్యం(58) మృతి చెందాడు. చిట్టేడు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం రెండు రోజుల క్రితం చెరువులో నీళ్లు తాగేందుకు వెళ్లిన పశువులను గట్టుకు తోలేందుకు నీటిలోకి దిగి గల్లంతైన సంగతి తెలిసిందే. సోమవారం అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు చెరువులో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. మంగళవారం సుబ్రహ్మణ్యం మృతదేహం చెరువులో తేలియాడుతుండడంతో అగ్నిమాపక సిబ్బంది బయటకుతీశారు. కోట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

నేటినుంచి సౌత్ జోన్ క్రికెట్ టోర్నీ

వెంకటగిరి, జనవరి 2: వెంకటగిరి పట్టణంలోని తారక రామా క్రీడా ప్రాంగణంలో బుధవారం నుంచి ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌత్ జోన్ అండర్ 14 మెన్ వన్‌డే ఇంటర్ డిస్ట్రిక్ టోర్నీ ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సౌత్‌జోన్ పరిధిలోని ఉమ్మడి నెల్లూరు, ఉమ్మడి చిత్తూరు, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. కాగా, బుధవారం గ్రౌండ్ - ఏ లో కడప - కర్నూలు జట్లు, గ్రౌండ్ - బీలో అనంతపురం - ఉమ్మడి నెల్లూరు జిల్లా జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుందని నిర్వాహకులు ప్రకటించారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు

గూడూరు, జనవరి 2: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని విందూరు, వేములపాళెం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో వసతులను, సౌకర్యాలను పరిశీలిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడులు

కోట, జనవరి 2: మండల పరిధిలోని గూడలితిప్ప కింద కోడిపందేల స్థావరంపై ఎస్ఐ నాగబాబు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం దాడులు జరిపారు. ఒక కోడిపుంజు, 9కత్తులు, రూ.5,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదే విధంగా కోట దళితవాడ సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్న పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.





గూడూరులో దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తూ, నాయుడుపేటలో సోదిచెబుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు, సీఐటీయూ నాయకులు

దున్నపోతు ప్రభుత్వానికి అంగన్వాడీల గోడు పట్టదా?

గూడూరు, జనవరి 2: దున్నపోతు ప్రభుత్వానికి అంగన్వాడీల గోడు పట్టడడం లేదని సీఐటీయూ నాయకులు అన్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని 22రోజులుగా దీక్ష చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మంగళవారం స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 22వ రోజు కొనసాగింది. దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీలు, సీఐటీయూ నాయకులు దున్నపోతుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతున్నామే కానీ, తామేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదన్నారు. 22 రోజులుగా కుటుంబ బాధ్యతలను పక్కనబెట్టి రోడ్డెక్కి దీక్ష చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిపద్ధతి కాదన్నారు. ఇకనైనా తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఇంద్రావతి, శివకుమార్, బీవీ రమణయ్య, సురేష్, ప్రసాద్, చంద్రయ్య, ప్రభావతి, పెంచలమ్మ, ప్రసన్న, మునికుమారి, లక్ష్మి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: మూడు వారాలుగా ఆందోళన చేస్తున్న అంగన్వాడీల మొర ఆలకించే సమయం ప్రభుత్వానికి లేదా అని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు హైమావతి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద రిలే దీక్ష చేస్తున్న అంగన్వాడీలు ఆవుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. తమ డిమాండ్లను అంగీకరించేకపోతే విధులకు హాజరయ్యే పరిస్థితి లేదన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరింది. సోది చెబుతానమ్మ... సోది అంటూ జగన్ పాదయాత్రలో ఇచ్చిన వాగ్ధానాలను వివరిస్తూ అంగన్వాడీలు వినూత్నరీతిలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శివకవి ముకుంద, అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ, సభ్యులు నాగమణి, చంగమ్మ, కళావతి, శ్యామలమ్మ, మేరీ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: సమస్యల సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు బంగారుపేట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న రిలే దీక్ష బుధవారం 22వ రోజు కొనసాగింది. డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, స్వరూపారాణి, మంజులా, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట మంగళవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు వినూత్నరీతిలో నిరసన తెలిపారు. మౌనం వహిస్తూ, సాష్టాంగ నమస్కారాలు చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.





కోటలో సాష్టాంగ నమస్కారాలు చేస్తున్న అంగన్వాడీలు - వెంకటగిరిలో అంబేడ్కర్ చిత్రపటానికి వినతిపత్రం అందజేత

కాలయాపన చేస్తే సమ్మె ఉధృతం





గూడూరు, నాయుడుపేటలో అర్ధనగ్నంగా ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు

గూడూరు, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 8వ రోజు కొనసాగింది. దీక్షా శిబిరం నుంచి పారిశుధ్య కార్మికులు ప్లకార్డులను చేతులో పట్టుకుని అర్ధనగ్న ప్రదర్శనగా గాంధీబొమ్మ సెంటర్, రాజావీధి మీదుగా టవర్‌క్లాక్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. కనీస వేతనం ఇవ్వడంతో పాటు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో గోపీనాథ్, శివకుమార్, బీవీ రమణయ్య, అరవ పార్వతయ్య, రమేష్, కోటేశ్వరరావు, పెంచలప్రసాద్, మురళి, సంపూర్ణమ్మ, సుబ్బమ్మ, పెంచలమ్మ, నారాయణమ్మ, పద్మమ్మ, మణి, శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిర్వహిస్తున్న మంగళవారం 8వ రోజు కొనసాగింది. కార్మికులు మానవహారంగా నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, ప్రసాద్, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: మున్సిపాలిటీలో పనిచేసే పారిశుధ్య కార్మికులందరికీ కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లయ్య అన్నారు. సూళ్లూరుపేటలో సమ్మెలో చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల న్యాయపరమైన కోర్కెలను మాత్రమే అడుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. సమ్మెలో ఉన్న కార్మికుల స్థానంలో అధికారులు కూలీలను నియమించడం సరికాదన్నారు. న్యాయపరమైన డిమాండ్ల కోసమే కార్మికులు పోరాటాలు చేస్తున్నారని, అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సాంబశివయ్య, పద్మనాభయ్య, అల్లెయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి పారిశుధ్య కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చాలీచాలని జీతంతో నానా అవస్థలు పడుతున్న పారిశుధ్య కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు మహేష్, సభ్యులు మస్తానయ్య, శ్రీనివాసులు, తేజ, కార్మికులు పాల్గొన్నారు.

ప్రైవేటు అంబులెన్స్‌లదే హవా
రుయాలో మహాప్రస్థానం వాహనాలుండీ ఉపయోగమేమి?



మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఖాళీగా ఉన్న మూడు మహాప్రస్థానం వాహనాలు

తిరుపతి సిటీ, జనవరి 2: రుయాస్పత్రిలో మృతదేహాలను ఉచితంగా తరలించడానికి నాలుగు మహాప్రస్థానం వాహనాలున్నాయి. ఏజెన్సీ తరపున నిర్వహించే ఈ వాహనాలకు నెలకు రూ.లక్ష చొప్పున రూ.4 లక్షలు బిల్లులైతే చెల్లిస్తున్నారు. అయినా ఇక్కడ ప్రైవేటు అంబులెన్స్‌ల నిర్వాహకుల హవానే నడుస్తోంది. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు మూడు మహాప్రస్థానం వాహనాలు అందుబాటులో ఉన్నాయి. అదే సమయంలో ఎంఎం వార్డు, అత్యవసర విభాగం నుంచి మృతదేహాలను తీసుకెళ్లడానికి ప్రైవేటు అంబులెన్స్‌లను బాధితులు ఆశ్రయించాల్సి వచ్చింది.

కమీషన్ల కోసమేనా?

ఆస్పత్రిలో రోజూ చికిత్స పొందుతూ ఏడు నుంచి తొమ్మిది మంది మృతి చెందుతుంటారు. ఇలా చనిపోయిన వారి వివరాలను వార్డులోని స్టాఫ్‌నర్సు, డాక్టరు వెంటనే మహాప్రస్థానం నిర్వాహకులకు తెలియజేయాలి. అలాగే ఉచితంగా మృతదేహాలను తీసుకెళ్లడానికి మహాప్రస్థానం వాహనాలు ఉన్నట్లు బాధితులకు తెలిసేలా బోర్డులు పెట్టాలి. అటువంటివేమీ ఇక్కడ కనిపించవు. మహాప్రస్థానం వాహనాలు, డ్రైవర్ల ఫోన్ నెంబర్లు వంటివి ఎక్కడన్నా చిన్నపాటి కాగితంపై చేతితో రాసి ఉంచుతున్నారు. ఎవరన్నా గుర్తించి అడిగితే వాహనాలు దూరంలో ఉన్నాయని, వచ్చేందుకు సమయం పడుతుందని అక్కడున్న సిబ్బంది చెబుతారు. అనంతరం ప్రైవేటు అంబులెన్స్‌లను రప్పించి, బాధితులకు సాయం చేస్తున్నట్లుగా నమ్మిస్తున్నారు. దీనికంతటికీ కింది స్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారులతోపాటు మహాప్రస్థానం వాహనాల నిర్వాహకులకు కమీషన్లు అందుతున్నాయన్న ఆరోపణలున్నాయి.

జీఎస్ఎల్వీ ప్రయోగానికి ఇస్రో సన్నాహాలు
షార్‌కు చేరిన ఇంధన వాహనాలు



షార్‌కు భద్రత నడుమ వస్తున్న ఇంధన వాహనాలు

సూళ్లూరుపేట, జనవరి 2: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఈ నెలలోనే మరో ప్రయోగానికి సన్నాహాలు చేస్తోంది.తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈ నెల 26న జీఎస్ఎల్వీ ప్రయోగం నిర్వహించనున్నారు. ఈ రాకెట్ ద్వారా ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. ఈ రాకెట్‌లో ఉపయోగించే ద్రవ ఇంధనాన్ని తమిళనాడులోని మహేంద్రగిరి నుంచి రెండు ప్రత్యేక వాహనాల్లో రోడ్డు మార్గాన భారీ భద్రత నడుమ మంగళవారం షార్‌కు తీసుకొచ్చారు. షార్‌లోని రెండో ప్రయోగ వేదికపై రాకెట్ అనుసంధాన పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. రాకెట్ మూడు దశల అనుసంధాన పనుల పూర్తయిన తరువాత శిఖర భాగాన ఉపగ్రహాన్ని అమర్చి ప్రయోగానికి రెడీ చేస్తారు. ఈ నెల 26న జీఎస్ఎల్వీ రాకెట్‌ను ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఏడాదిలో తొలి రోజు చేపట్టిన ఎక్స్‌పోశాట్ ఉపగ్రహ ప్రయోగ విజయంతో ఇదే ఉత్సాహంతో శాస్త్రవేత్తలు మరో ప్రయోగానికి సిద్ధమయ్యారు.

త్వరలో రామన్నరాజ్యం



మద్దాలిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, జనవరి 2: మరో కొద్ది నెలల్లో సీఎం జగన్ ఆధ్వర్యంలో నడుస్తున్న రాక్షసపాలన పోయి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రామన్నరాజ్యం వస్తుందని టీడీపీ నాయకులు తెలిపారు. మండల పరిధిలోని మద్దాలిలో మంగళవారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని చేపట్టారు. మద్దాలి మెయిన్, దళిత, గిరిజన కాలనీలో ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టో గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. పాశం సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి అభివృద్ధికి బాటలు వేసుకుందాం అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, నాయకులు మధుయాదవ్, మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, చంద్రయ్య నాయుడు, షంషుద్దీన్, బాలకృష్ణయాదవ్, వెంకటకృష్ణారెడ్డి, నాయబ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షితలు



కోటలో ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

కోట, జనవరి 2: కోట పట్టణంలోని ఇంటింటికీ అయోధ్య అక్షితలను బీజేపీ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని సాయిబాబా గుడి దగ్గర నుంచి గోపాలరెడ్డి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అయోధ్య నుంచి తెప్పించిన అక్షితలను ఇంటింటా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సారంగం రమేష్‌బాబు, నాయకులు రమణారెడ్డి, వాసు, అంబరీషా, పరుశు రామ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు ఇప్పించండి



5 ఎన్‌పేట 2: పోలీసుస్టేషను ఎదుట కార్మికులు

నాయుడుపేట టౌన్, జనవరి 2: మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం వద్దనున్న షుగర్ ఫ్యాక్టరీ నుంచి తమకు రావాల్సిన బకాయిలను ఇప్పించాలంటూ గతంలో పనిచేసిన కార్మికులు నాయుడుపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్మాగారం మూసివేత సమయంలో కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వలేదన్నారు. ఫ్యాక్టరీని బ్యాంకు వేలంలో దక్కించుకున్న వ్యక్తి పరిశ్రమలోని స్క్రాప్‌ను కూడా విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన బకాయిలను ఇప్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వండి

బాలాయపల్లి, జనవరి 2: సాగుభూములకు పట్టాలివ్వాలని మండలంలోని కడగుంట గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీవాసులు మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలోని సర్వేనంబరు 1లో భూమికి 1992లో సీజెఎఫ్ఎస్ పట్టాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అసైన్‌మెంట్ చేసేందుకు సీజెఎఫ్ఎస్ పట్టాలను రద్దు చేశారన్నారు. అప్పటి నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. సదరు భూమి అడవి కావడంతో ఏమీ చేయలేమని తహసీల్దార్ చెప్పారు.